
జీవితం రెండు (ద్వంద్వ) కారకాల ద్వారా నడుస్తుంది,అంతర్గత ప్రవృ త్తులు మరియు బాహ్యా ప్రభావా లు. అంతర్గత ప్రవృత్తులు మీ వైఖ రులను మరియు ప్రవర్తనను రూ పొందిస్తాయి, అయితే బాహ్యా ప్ర భావాలు మీ మనస్సులో బలమైన ముద్రలను వేస్తాయి. తరచుగా మీ ప్రవృత్తులు బాహ్యా పరిస్థితులను సృష్టిస్తాయి. మరియు మీ చుట్టూ ఉన్న పరిస్థితులు మీలో ప్రవృత్తుల ను ఏర్పరుస్తాయి. దీనినే కర్మ అం టారు. ఈ రెండు కారకాలు - అంత ర్గత ప్రవృత్తులు మరియు బయటి ప్రభావాలు, ప్రయోజనకరంగా లే దా హానికరంగా ఉండవచ్చు. బా హ్యా ప్రతికూల ప్రభావాలను వడ పోసేది చైతన్యమే, మరియు అనా రోగ్యకరమైన అంతర్గత ప్రవృత్తుల ను సరిదిద్ది, నాశనం చేసేది కూడా చైతన్యమే. ఈ చైతన్యాన్నే జ్ఞానం అంటారు. విద్య యొక్క ఉద్దేశ్యం ఈ చైతన్యాన్ని అభివృద్ధి చేయడ మే, తద్వారా మీరు మీ ప్రవృత్తులు మరియు ప్రభావాల విషయంలో ఎంపిక చేసుకోగలుగుతారు. ఒకరి చైతన్యాన్ని పెంచుకోకుండా బా హ్యా ప్రభావాలను మరియు అంత ర్గత ప్రవృత్తులను ఎదిరించడం ఆ చరణాత్మకంగా అసాధ్యం. ఇది క్ర మంగా లేదా ఆకస్మికంగా జరగవ చ్చు. ఆ విధంగానే మానవునికి స్వే చ్ఛా సంకల్పం మరియు గమ్యం రెండూ ఉంటాయి. మీ ప్రవృత్తులు మరియు మీపై ప్రభావం చూపే అం శాల గురించి మీకే నిర్ణయాధికారం ఉన్నప్పుడే స్వేచ్ఛ లభిస్తుంది. మ రియు కేవలం అవగాహన, నిష్క ళంకమైన భక్తి మాత్రమే ఈ స్వేచ్ఛ ను తీసుకురాగలవు.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ




www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 148 | ఆదివారం | 29 మార్చి 2026 | పేజీలు : 04 వెల ₹5


## పదేళ్ళ 'మైనింగ్'పై

# సీబీ సీఐడీ

## పదేళ్లపాటు మైనింగ్ లీజులతో వేల కోట్లు కొల్లగొట్టిన హరీశ్, కేటీఆర్

- ఇసుక మాఫియాలో హరీశ్ రావు తమ్ముడు మహేశ్ రావు
- ఏపీ మాజీ ఎమ్మెల్యేను బెదిరించి మైనింగ్ లీజు రాయించుకున్నారు
- నేరెళ్ల ఇసుక మాఫియాలో సంతోష్ రావు తండ్రి రవీందర్ రావు
- గంగుల కమలాకర్‌కు చెందిన శ్వేత గ్రానైట్స్‌లోనూ అక్రమ మైనింగ్
- వద్దిరాజు రవిచంద్రను బెదిరించి గాయత్రీ గ్రానైట్స్ రాయించుకున్నారు
- ఇప్పటిదాకా జరిగిన ఇసుక, మైనింగ్ లీజులపై సీబీసీఐడీ విచారణ
- జరిమానాలు వేసి.. తర్వాత తగ్గించి పార్టీలోకి చేర్చుకున్న ఉదంతాలపైనా.. ఇవన్నీ వచ్చే సమావేశాల్లో బయటపెడ్తం
- రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీపై కూడా సీబీసీఐడీ విచారణ జరుపుతాం
- రాఘవకు, పొంగులేటికి సంబంధం లేదు.. ఉంటే నోటీసులిస్తామా!?
- సీఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి (2014, జూన్ 2) నుంచి నేటి వరకూ ఇచ్చిన మైనింగ్ లీజులు, ఇసుక తవ్వకాల్లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో సీబీసీఐడి విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. విచారణలో నిజాలను నిగ్గు తేల్చి.. వచ్చే శాసనసభ సమావేశాల్లో బయట పెడతామన్నారు. శాసనసభలో శనివారం ఆయన మాట్లాడారు. "మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తమ్ముడు మహేశ్ రావు ఇసుక మాఫియా నడిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ మాజీ ఎమ్మెల్యేకు శిరీషా జీయో గ్రానెట్స్ కంపెనీ ఉండేది. అప్పట్లో మైనింగ్ శాఖ మంత్రిగా ఉన్న

మిగతా 2 లో



02

# పౌష్టికాహార 'తొలి ముద్ద'

- చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలను తొలగిస్తున్నాం
- అంగన్వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభోత్సవంలో సీఎం

## ప్రక్షాళన అడ్డుకుంటే ప్రతాపం చూపిస్తాం

- మానవ తప్పిదాలను సరిదిద్దకపోతే చరిత్ర క్షమించదు
- రామప్ప నమూనాతో ఓంకారేశ్వరం
- ఈ అభివృద్ధిని చూపించి ఓట్లు అడగం: సీఎం రేవంత్
- మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

02



## అదరం, బెదరం

# అక్రమాల అంతుతేలుస్తాం

## కాంగ్రెస్ నడిపేది సర్కారా? రౌడీ దర్బారా?

- ప్రజలను భయపెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ నడిపేది సర్కారా? రౌడీ దర్బారా?
- పిచ్చోడి చేతిలో రాయి కాదు.. రాష్ట్రమే ఉన్నది
- ఈ శతాబ్దపు మోసం అభయహస్తం మ్యానిఫెస్టో
- అరాచకాలను అడ్డుకునేందుకు సిద్ధంకావాలి
- ఇంటింటికీ వెళ్లి వివరించి ప్రజల్లో చైతన్యం తేవాలి
- బీఆర్ఎస్వీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం

సాములపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్ బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించిన సందర్భంలో కూడా ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు.

02

## అక్రమ మైనింగ్‌కు 'అధికారం' అండదండ

- కొత్వాల్‌గూడ వద్ద మంత్రికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్
- మైనింగ్ అనుమతుల్లేకుండానే ఆ కంపెనీ పొంగులేటిది కాదంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడిన సీఎం
- భార్య, కొడుకు దూరపు బంధువులా?
- అసెంబ్లీలో హరీశ్‌రావు ధ్వజం
- స్పీకర్ పోడియం వద్ద బైఠాయింపు
- బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం లూటీ మంత్రుల దీటైన కౌంటర్లు



03

# విచారణకు నిర్దిష్టగడువు విధించాల్సిందే

## నియోజకవర్గాల పునర్విభజనతో సీఎంలో కుంగుబాటు

## కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మైనింగ్ అక్రమాలపై విచారణకు నిర్దిష్ట గడువు విధించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఫిర్యాదుల పేరుతో గ్రానైట్ కంపెనీలను ఎవరు బ్లాక్‌మెయిల్ చేశారో వెల్లడించాలన్నారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌పై విచారణను విచారణను స్వాగతిస్తున్నట్లు పేర్కొంటూ, అసెంబ్లీలో ప్రకటనలకే పరిమితమై, ఆచరణలో చర్యలు లేకపోతే ప్రజలు అంగీకరించరని చెప్పారు.

02





## అంతర్జాతీయంగా అల్లకల్లోలం అయినా మనం అప్రమత్తమయ్యాం

**నోయిడాలో జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1 ప్రారంభంలో మోదీ**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు అల్లాడుతున్నాయని, కానీ, భారతదేశం మాత్రం నిలదొక్కుకుంటోందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచంలోని చాలా దేశాలు చమురు, ఆహారం, నిత్యావసరాల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు.

04



# లాక్ డౌన్ ప్రస్తావన లేనేలేదు

**పెట్రో ధరల నియంత్రణకే ఎక్సైజ్ సుంకం తగ్గింపు: కిషన్‌రెడ్డి**

అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, మనదేశంలో ప్రస్తుత ధరలు మరింత పెరగకుండా ఉండేందుకే కేంద్రం వాటిపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డీ తెలిపారు.

## మహిళా బిల్లుకు సంపూర్ణ సహకారం

## మహిళలకు రిజర్వేషన్‌తోనే 2029 ఎన్నికలు

- నియోజకవర్గాల పునర్విభజన లేకుండా కోటా అమలు వీలుకాదు
- బిల్లుకు సహకరించాలని ఖర్గే, రాహుల్‌ను కోరుతున్నాం
- పునర్విభజన కమిషన్ ఏర్పాటుపై ప్రతిపక్షాలతో చర్చిస్తున్నాం
- దేశంలో నక్సలిజం అంతరించినట్లే: కేంద్ర మంత్రి అమిత్‌షా



04

## ఇరాన్ కొత్త సుప్రీం ఇక లేకపోవచ్చు

**మయామీలో ఓ సదస్సులో ట్రంప్ వ్యాఖ్యలు**

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కూడా చనిపోయి ఉంటారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. మయామీలో జరిగిన ఓ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మొజ్తబా చనిపోయి ఉంటాడు. లేదా తీవ్రంగా గాయపడి ఉంటాడు. ఎందుకంటే ఆయన ఎక్కడా కనిపించట్లేదు" అన్నారు.

04



# పదేళ్ళ 'మైనింగ్'పై సీబీసీఐడి



మొదటి పేజీ తరువాయి

హరీశ్‌రావు ఆ మాజీ ఎమ్మెల్యేను బెదిరించారు. ఆ కంపెనీ మైనింగ్‌ను బలవంతంగా లీజుకు రాయించుకున్నారు. అక్రమ మైనింగ్ చేశారు. దానిపై విచారణ చేయిస్తాను" అని సభలో ప్రకటించారు. రెవెన్యూ మంత్రిని బెదిరించేందుకు యత్నిస్తున్న హరీశ్‌రావు..

తన తమ్ముడైన మహేశ్ రావు పేరుమీద అక్రమంగా మైనింగ్ చేసుకున్నారని, దానిపై కూడా విచారణ జరిపిస్తామన్నారు. "సిరిసిల్ల నియోజకవర్గంలోని నేరెళ్ల ఇసుక బాధితులైన దళితులను లారీ ఎక్కించి, తొక్కించి, చంపించి, ఇసుక అక్రమ రవాణా చేసిన జోగినిపల్లి సంతోష్ రావు తండ్రి రవీందర్‌రావుకు సంబంధించిన ఇసుక మాఫియాపై విచారణ జరిపించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు చెందిన శ్వేత గ్రానైట్స్‌లో అక్రమ మైనింగ్ జరిగింది. దానిపై రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోపాటు ఈడీ ఎంక్వైరీ జరిగింది. శ్వేత గ్రానైట్స్‌పై కూడా విచారణకు ఆదేశిస్తున్నాం. వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రీ గ్రానైట్ కంపెనీకి నోటీసులిచ్చి.. జరిమానా విధించి.. లొంగదీసుకుని, ఆయన గ్రానైట్‌ను బలవంతంగా రాయించుకున్నారు. దానిపై కూడా విచారణ జరిపిస్తాం" అని సీఎం ప్రకటించారు. అధికారంలో ఉన్నప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ ఇసుక దోపిడీకి పాల్పడ్డారని, ఆ మాఫియాకు నాయకత్వం వహించింది వారిద్దరేనని ఆరోపించారు. "మైనింగ్ శాఖ తొలుత హరీశ్ దగ్గర ఉండేది. ఆయన అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని కేసీఆర్ ఆ శాఖను తొలగించారు. కొడుకు, అల్లుడి మధ్య పంచాయితీ కారణంగా ఆ శాఖను కేటీఆర్‌కు అప్పగించారు. వారి అక్రమాలను బయటకు తీస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఐదేళ్లపాటు హరీశ్, కేటీఆర్ ఆ శాఖను తీసుకుని, వేలాది కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇప్పుడు మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు అప్పట్లో ఇసుక మాఫియాలో భాగస్వాములని చెప్పారు. వారి పదేళ్ల దోపిడీ ప్రజలకు అర్థమవుతుందని బెంబేలెత్తుతున్నారని వ్యాఖ్యానించారు. ఇసుక, లీజు మాఫియా, జరిమానాలు వేసి.. ఆ తర్వాత తగ్గించి వారిని పార్టీలోకి తీసుకున్న ఉదంతాలపై విచారణ చేయిస్తామని, ఒక్కొక్కరి సంగతి తేలుస్తామని సీఎం హెచ్చరించారు.

### రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీపైనా విచారణ

ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండిపడినా, ఎలాంటి తప్పిదాలు జరిగినా ఎవర్నీ ఉపేక్షించబోమని సీఎం రేవంత్ హెచ్చరించారు. అందరి నిగ్గు తేలుస్తానన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిచర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీపైనా సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. "రాఘవ కన్‌స్ట్రక్షన్ నుంచి సీనరేజీ చార్జీ కింద రూ.1,52,97,825.. పర్మిట్ ఫీజు కింద రూ.1,22,25,446 ప్రభుత్వం కట్టించుకుంది. ఇది ఏదో బీఆర్ఎస్ నేతలు కనిపెట్టి వారు ఫిర్యాదు చేస్తే తీసుకున్న చర్య కాదు. ప్రభుత్వమే స్వయంగా వివరాలు సేకరించింది. ఆ సంస్థకు నోటీసులిచ్చింది. దాని నుంచి సర్కారుకు రావాల్సిన బకాయిలను రాబట్టడమే కాకుండా, తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చాం" అని వివరించారు. ఇందులో విపక్షం ఫిర్యాదు లేదని, మరెవరో చెప్పలేదని, ఉద్దేశపూర్వకంగా ఒక మంత్రిపై బురదజల్లాలని, అక్కసు వెళ్లగక్కాలని, వారు అనుకున్న పైరవీలకు ఆ మంత్రి సహకరించడం లేదని ఆయనపై ఒత్తిడి తీసుకువచ్చి బ్లాక్‌మెయిల్ చేయాలనుకున్నారని ఆరోపించారు. ఇటువంటివి ఇంకెక్కడైనా జరుగుతాయేమో కానీ, తమ ప్రభుత్వంలో సాగవని, అటువంటి బ్లాక్ మెయిల్‌కు ప్రభుత్వం భయపడబోదని స్పష్టం చేశారు.

### రాఘవకు, మంత్రి పొంగులేటికి సంబంధం లేదు

రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి, మంత్రి పొంగులేటికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. "ఇసుక మాఫియాలో మంత్రులకు ప్రమేయం ఉంటే ప్రభుత్వం నోటీసులిస్తుందా? నోటీసులిచ్చి పన్నులు వసూలు చేయడం జరుగుతుందా!? రాఘవ కన్‌స్ట్రక్షన్లో పొంగులేటికి ప్రత్యక్ష సంబంధం ఉంటే ఈరోజు నోటీసులిచ్చి, ఆదాయం రాబట్టుకునే ప్రయత్నం చేస్తామా?" అని ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణల్లో ఏ రెడ్డి అయినా మరో రెడ్డికి దూరపు బంధువో, దగ్గర బంధువో అయి ఉంటారని వ్యాఖ్యానించారు. "సొంత అన్నదమ్ముల ఆస్తుల పంపకాల్లోనే తేడాలొస్తున్నాయి. కేటీఆర్, కవిత ఇద్దరూ కేసీఆర్ సంతానమే. పంపకాల్లో తేడాలు రావడంతో సొంత చెల్లినే ఇంట్లో నుంచి మెడలు పెట్టి బయటకు పంపారు. అన్నాచెల్లెళ్లకే ఆస్తి తగాదాలున్నప్పుడు.. పొంగులేటి కుటుంబ సభ్యులకో.. బంధువులకో గొడవలుంటే మంత్రికి ఏం సంబంధం" అని ప్రశ్నించారు. సొంత చెల్లినే ఇంట్లో నుంచి, పార్టీ నుంచి వెళ్లగొట్టి దోపిడీకి పాల్పడిన చరిత్ర కల్వకుంట్ల కుటుంబానిదని మండిపడ్డారు. "బీఆర్ఎస్ ఎటువంటి బురదజల్లినా భయపడేది లేదు. మంత్రులను బ్లాక్ మెయిల్ చేసి భూములను రాయించుకుందామనే పప్పులుడకవు. ఇతర విషయాలను పొంగులేటికి ముడిపెట్టి, ఆయన్ను బెదిరించి, లొంగదీసుకోవాలనే ప్రయత్నం దిక్కుమాలిన చర్య. ఇలాంటి దిక్కుమాలిన ప్రయత్నాలు చేస్తే బీఆర్ఎస్‌కు ప్రయోజనం ఉండదు" అని స్పష్టం చేశారు.

### 35 శాతం ఆదాయం పెంచాం

రాష్ట్ర ఖజానాకు ఒక్క రూపాయి కూడా గండి పడకూడదని, ప్రతి పైసా ఖజానాకు చేరాలని మంత్రులు, అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని సీఎం రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక ఆదాయం పెరిగిందని తెలిపారు. "మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25లో సర్కారుకు సీనరేజీ ద్వారా 721 కోట్ల ఆదాయం వచ్చింది. 2025-26లో అది 972 కోట్లకు చేరింది. అంటే, ఆదాయాన్ని 35 శాతం పెంచాం. ఇసుక మాఫియాను నడిపి, దోపిడీకి పాల్పడిందే బీఆర్ఎస్" అని ఘాటుగా విమర్శించారు.

# ప్రత్యేక తెలంగాణలో క్రీడా స్ఫూర్తి కనుమరుగు

## అందుకే స్పోర్ట్స్ పాలసీ, క్రీడలకు ప్రాధాన్యం..

## మెస్సీని కాకుండా డ్రగ్స్ కింగ్‌ను పిలవాలా!?

### క్రీడలను బహిష్కరించడం క్రీడా స్ఫూర్తా!?

### వాళ్లకు ఫాంహౌస్, పబ్ విందులే కావాలి

### యువత వాటికి దూరంగా ఉండాలనే క్రీడలకు ప్రోత్సాహం: సీఎం రేవంత్‌రెడ్డి

### ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల స్పోర్ట్స్ మీట్



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తి కనుమరుగైందని, క్రీడలంటే ఎలా ఉంటాయని వెతుక్కునే పరిస్థితి దాపురించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని, ప్రపంచ స్థాయిలో పరిణామాలు, వివిధ క్రీడలు, క్రీడాకారులు, శిక్షణకు ప్రత్యేక సలహాదారుడ్ని ఏర్పాటు చేశామని తెలిపారు. స్పోర్ట్స్ పాలసీతో మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర శాసన మండలి, శాసన సభ సభ్యులకు బడ్జెట్ సమావేశాల సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎల్బీ స్టేడియంలో శనివారం స్పోర్ట్స్ మీట్-2026ని సీఎం రేవంత్ రెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మంత్రి జూపల్లి ఆ జ్యోతితో మైదానంలో రన్‌లో పాల్గొని మిగతా సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు ప్రతిపక్ష నాయకులు క్రీడలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారని, అదేం క్రీడా స్ఫూర్తో తనకు అర్థం కావడం లేదని విమర్శించారు. రాజకీయాలకతీతంగా మైదానంలో క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తే.. భవిష్యత్తు తరాలు కలిసిమెలిసి ఉండే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. "ప్రతిపక్షాల ఆలోచనలు ఎంతసేపు ఫాంహౌసల్లో పార్టీలు, పబ్‌ల్లో విందుల గురించే. ఫాంహౌస్ పార్టీలు, పబ్‌ల్లో విందులకు, డ్రగ్స్, గంజాయి, మత్తుకు యువతను దూరంగా ఉంచేందుకు 'మత్తు బాట వీడండి.. మైదానాల బాటపట్టండి' అని పిలుపునిచ్చాం. ఈ స్ఫూర్తి కొనసాగుతుంది" అని ప్రకటించారు.




### మెస్సీని కాకుండా డ్రగ్స్ కింగ్‌ను పిలవాలా!?

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని నగరానికి తేవడంతో రాష్ట్ర ఖ్యాతి ప్రపంచానికి తెలిసిందని, కానీ, ప్రతిపక్షాల తీరు చూస్తుంటే మెస్సీని కాకుండా డ్రగ్స్ కింగ్‌ను పిలవాలన్నట్లు ఉందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "క్రీడా స్ఫూర్తిని నింపేందుకు మెస్సీని తెచ్చాం. కొందరు ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేసారు. అతన్నెందుకు పిలిచారని చర్చ లేవనెత్తారు. మెస్సీని కాకుండా మెక్సికోలో ఎన్‌కౌంటర్ అయిన డ్రగ్స్ కింగ్ లార్డ్ చాకోను పిలిస్తే ఆనందపడతారా!?" అని ఎద్దేవా చేశారు. ప్రజా జీవితంలో ఉండే వారికి స్ఫూర్తి, విశ్రాంతినిచ్చేందుకే బడ్జెట్ సమావేశాల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు రాష్ట్రం క్రీడల రాజధానిగా రాణించిందని, ఆ తర్వాత వివిధ కారణాలతో పోటీల నిర్వహణ తగ్గుతూ పోయిందన్నారు.

### 2034లో గచ్చిబౌలిలో ఒలింపిక్స్

"గచ్చిబౌలిలో ఉన్న 70 ఎకరాల క్రీడా మైదానాల్ని రూ.700 కోట్లతో ప్రపంచ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేస్తాం. 2034లో ఒలింపిక్స్ అక్కడ నిర్వహించేలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. మూడు నెలల్లో పనులు ప్రారంభించి మూడు సంవత్సరాల్లో అభివృద్ధి చేస్తాం" అని ప్రకటించారు. రాజకీయ కార్యక్రమాలకే పరిమితమైన ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, అద్భుత క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. "బేగంపేట్‌లో ఉన్న అంతర్జాతీయ హాకీ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తాం. 1950-60 మధ్య ఒలింపిక్స్‌లో మొదటిసారి భారతదేశానికి ఫుట్‌బాల్‌లో నాలుగోస్థానం వచ్చింది. నాడు ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్ నుంచే పోటీల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇప్పటి వరకూ ఎంట్రీ లెవల్‌కు కూడా వెళ్లలేదు. ఒకప్పుడు ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్‌కు మన రాష్ట్రం, నగరం దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చాయి. ఇప్పుడు వెనకబడ్డాం. అందుకే, క్రీడాస్ఫూర్తితో ప్రభుత్వం చర్యలు చేపట్టింది"అని వివరించారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని, క్రీడల్లో రాణించేవారికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ప్రోత్సహించే బాధ్యత తమదని చెప్పారు. తెలంగాణలో మొదటిసారి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కొనియాడారు. క్రీడలకు కులం, మతం, రాజకీయాలు ఉండవని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కాగా, ఆదివారం రెండో రోజు శాసన సభ్యుల క్రీడా పోటీలు కొనసాగుతాయి.

### ఫుట్‌బాల్‌లో సీఎం.. కబడ్డీలో సత్తా చాటిన వాకిటి

క్రీడా పోటీల్లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు చురుగ్గా పాల్గొని ఆయా క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఐదు గోల్స్‌తో సీఎం జట్టు విజయం సాధించగా.. అత్యధికంగా నాలుగు గోల్స్‌ను సీఎం రేవంత్ రెడ్డి కొట్టారు. కబడ్డీలో క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి ఒక్కరే 15 పాయింట్లు సాధించి సత్తా చాటారు. మహిళా సభ్యులకు ప్రత్యేకంగా నిర్వహించిన లెమన్‌అండ్‌స్పూన్ గేమ్‌లో మంత్రి కొండా సురేఖ విజయం సాధించారు. ఫుట్ బాల్, కబడ్డీ పోటీల్లో పలువురు సభ్యులు కిందపడ్డా.. తిరిగి లేచి నిలబడి ఎంతో చురుగ్గా పోటీల్లో పాల్గొన్నారు. తాము, జట్టు పాయింట్లు సాధించిన సమయంలో ఆనందంగా గంతులేశారు.



# పౌష్టికాహార 'తొలి ముద్ద'



## చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలను తొలగిస్తున్నాం

## అంగన్వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభోత్సవంలో సీఎం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలోని చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలను రూపుమాపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీల్లో చిన్నారులకు ఉదయం పూట అల్పాహారం అందించేందుకు ఉద్దేశించిన 'తొలి ముద్ద' పథకాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రత ఉంది కానీ.. అందరికీ పౌష్టికాహారం అందడం లేదని తెలిపారు. అందుకే బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తున్నామని.. ఇప్పుడు తొలి ముద్ద పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల బాగుంటుందని అన్నారు. తొలి ముద్ద పథకాన్ని సరిగా అమలు చేయాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లపైనే ఉందని అన్నారు. చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని, వారికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని.. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని తెలిపారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా అంగన్వాడీల సమస్యలనే పరిష్కరిస్తామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు.. సొంత భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు సీఎం మొబైల్ ఫోన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, శిశు సంక్షేమ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలి ముద్ద పథకం ద్వారా అంగన్వాడీ చిన్నారులకు రోజూ ఉదయం ఉప్మా, కిచిడీని అందించనున్నారు.

# త్వరలో 15 వేల అంగన్‌వాడీ పోస్టుల భర్తీ!

## ఆయాలు, టీచర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేస్తాం: సీతక్క

### బీఆర్ఎస్ వాకౌట్.. మంత్రి ఆగ్రహం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో 15 వేల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ వెలువరించనున్నట్లు పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రకటించారు. ఆయాలు, టీచర్ల పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు పెంచామన్నారు. పొదుపు సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలియజేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఆమె బదులిచ్చారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాపై సర్వే చేయగా.. 4 లక్షల ఇళ్లకు నీటి కనెక్షన్లు లేవని, మరో 3 లక్షల ఇళ్లకు నీళ్లు రావడం లేదని, వెరసి 7 లక్షల కుటుంబాలకు నల్లానీళ్లు అందడం లేదని గుర్తించామని, దీనికి నిధుల కోసం కేంద్ర జల్‌జీవన్ మిషన్‌కు రూ.1600 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని సీతక్క తెలియజేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా వంద శాతం ప్రాంతాలకు నీళ్లు ఇచ్చామని ప్రకటించారని, దీంతో ఈ నిధులను కేంద్రం నిలిపివేసిందన్నారు. పదేళ్లలో పంచాయతీలకు ఇవ్వాల్సిన 42 శాతం మ్యాచింగ్ గ్రాంట్లను గత ప్రభుత్వ హయాంలో మళ్లించారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా లక్ష మందికి పెన్షన్లు ఇచ్చామని, రానున్న రోజుల్లో మరో 2 లక్షల మందికి ఇస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి, దాని స్థానంలో తెచ్చిన పథకంతో రాష్ట్రంపై రూ.1500 కోట్ల భారం పడిందన్నారు. మహిళల పట్ల గౌరవాన్ని పెంచేలా పాఠశాల విద్యార్థుల సిలబస్‌లో మార్పులు చేస్తామన్నారు.

### పంచాయతీలకు ప్రత్యేక నిధులివ్వాలి: బీఆర్ఎస్

99 రోజుల ప్రజా పాలన ఉత్సవాల కార్యక్రమంలో పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో 20 రోజుల పనిదినాల నిబంధనను సడలించి, సహాయం చేయాలని కోరారు. యువతీ యువకులు పెళ్లి కోసం దరఖాస్తు పెట్టుకుంటే పిల్లలు పుట్టిన తర్వాత ప్రభుత్వం నుంచి సహాయం అందుతోందని సునీత విమర్శించారు. పంచాయతీలకు మూడునెలలకు ఒకసారి నిధులు ఇస్తేనే మేలు జరుగుతుందని, ఆర్నెల్లకు ఒకసారి ఇచ్చే నిధులతో ఏ పనిచేయలేరని సిర్పూర్-కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ వాకౌట్ చేయగా... మంత్రి సీతక్క వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్యాలు చెప్పడం వారి నైజమన్నారు.



# ప్రక్షాళన అడ్డుకుంటే ప్రతాపం చూపిస్తాం

**మానవ తప్పిదాలను సరిదిద్దకపోతే చరిత్ర క్షమించదు**

**రామప్ప నమూనాతో ఓంకారేశ్వరం**

**ఈ అభివృద్ధిని చూపించి ఓట్లు అడగం: సీఎం రేవంత్**

**మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన**

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** "ఎవరెన్ని విమర్శలు చేసినా.. అడ్డంకులు సృష్టించినా.. అక్కడి సూర్యుడు ఇక్కడ మొలిచినా మూసీ నది ప్రక్షాళనను పూర్తి చేసి తీరుతాం. ఇది మా శివదీక్ష. దీనిపై ఎవరైనా దుష్ప్రచారం చేసినా.. పెడర్థాలు అంటగట్టినా రాష్ట్ర ప్రభుత్వం శివతాండవం చేస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మానవ తప్పిదాలతో కనుమరుగయ్యే ప్రమా దం నుంచి హైదరాబాద్‌ను కాపాడి భవిష్యత్తు తరాలకు అత్యద్భుతమైన నగరాన్ని అందించాలన్నదే రాష్ట్రప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. మూసీ రి వర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా గండిపేట చెరువు దిగువన మంచిరేవులలోని చారిత్రక వీరభద్రస్వామి ప్రాంగణంలో మచిలేశ్వర స్వామి, ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. మచిలేశ్వర స్వామికి కుటుంబ సమేతంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించి, ఎన్కపల్లిలో వంద ఎకరాల్లో నిర్మించే గోశాలకు ఇక్కడి నుంచే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. "శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. మూసీ ప్రక్షాళనకు రాష్ట్రంలో చాలామంది ప్రజా ప్ర తినిధులు ప్రయత్నం చేశారు. కారణాలు ఏవైనా ముందుకు సాగలేదు. ఆ అవకాశం మాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. మూసీ తీరాన ఉన్న ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. అది కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన" అని తెలిపారు. అడ్డంకులు సృష్టించినా.. వాటిని ఈశ్వరుడే తొలగిస్తాడన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్యకారకంగా మారిందని, వాటిని సరిదిద్దకపోతే చరిత్ర మనల్ని క్షమించదన్నారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతని ప్రశ్నించారు. పరీవాహక ప్రాంతాన్ని మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా, ప్రత్యేకమైన ధ్యాన మందిరాలతో అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. నదిని ప్రక్షాళన చేయాలని మూసీ పరీవాహక ప్రజాప్రతినిధులంతా కోరుతున్నారని, స్వార్థ, రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి కొంతమంది మాత్రం తాము చేయలేని పనిని ఎవరూ చేయొద్దని, చేస్తే వాళ్లకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో అడ్డుకుంటున్నారని విమర్శించారు.

### దక్షిణ కాశిగా మంచిరేవుల

హైదరాబాద్ మత సామరస్యానికి వేదిక అని, అందుకు అనుగుణంగానే.. గండిపేట వద్ద ఓంకారేశ్వర ఆలయం; మక్కా మసీదు ప్రాంతంలో అద్భుతమైన మసీదు; గౌలిగూడ ప్రాంతంలో సిక్కుల కోసం స్వర్ణ దేవాలయం తరహాలో గురుద్వారా; నాగోల్ ప్రాంతంలో అద్భుతమైన చర్చి నిర్మించబోతున్నామని ప్రకటించారు. రుద్ర దేవుడు నిర్మించిన రామ ప్ప మందిరాన్ని నాడు దర్శించుకొని ప్రజా పాలన తెస్తామని చెప్పామని, రామప్ప మందిర ఆలయ నమూనానే ఈరోజు మంచిరేవులలో నిర్మించాలనుకుంటున్నామని తెలిపారు. "మూసీ ప్రక్షాళనే కాదు.. గొప్ప పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా రాణించేలా ఈ పుణ్యక్షేత్రాన్ని ముందుకు తీసుకెళ్తాం. మీరంతా అండగా నిలబడండి. ఆశీర్వదించండి. ఈ అభివృద్ధిని చూపించి ఓట్లు అడగం. ఓట్లు.. నోట్ల కోసం ఈ ప్రయత్నం కాదు" అని సీఎం స్పష్టం చేశారు.

### అక్కా.. ఎన్జీటీలో వేసిన కేసు ఉపసంహరింపజేయండి

"ఒక అక్క కుటుంబం ఈ ప్రాంతం నుంచి 45 ఏళ్లుగా నూటికి నూరు శాతం రాజకీయ ప్రయోజనం పొందుతూ ఉంది. ప్రజాప్రతినిధులుగా, మంత్రులుగా పదవులు అనుభవించారు. రాష్ట్రంలో అక్కకు గుర్తింపు వచ్చింది. కానీ, మూసీ ప్రక్షాళన ఆపాలంటూ అక్క కొడుకు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో కేసు వేసిండు. ఇలాంటి తప్పుడు కేసు వేస్తుంటే అక్క మనసు ఎట్లా ఒప్పుకున్నదో" అని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలు వాళ్ల కుటుంబాన్ని ఆశీర్వదించారని, అయినా, ఇక్కడి అభివృద్ధిని అడ్డుకోవడానికి స్థానికుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా కేసు వేశారని మండిపడ్డారు. ఎన్జీటీలో వేసిన కేసును తక్షణమే ఉపసంహరింపజేయాలని, లేకపోతే, ఈ ప్రాంత ప్రజలు మీ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. "వాళ్ల వెనక ముసుగు తొడుక్కొని దాక్కున్న వారికి కూడా చెబుతున్నా. మీవల్ల గాని పనులు మేం చాలా చేస్తున్నాం. మీరు ఇట్లనే ఉంటే ఆ హోదా కూడా మిగలేదు. ఇట్లాంటి చిల్లర మల్లర ప్రయత్నాలు మానేయ్యుర్రి" అంటూ బీఆర్‌ఎస్‌కు హితవు పలికారు.

# ఎన్కపల్లిలో..ఆధునిక గోశాల

**రూ.157 కోట్లతో 99 ఎకరాల్లో నిర్మాణం**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కపల్లిలో ప్రతిపాదిత ఆధునిక గోశాల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పశు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆధునిక గోశాలను ఎన్కపల్లిలో నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. సంప్రదాయ విలువలను ఆధునిక శాస్త్రీయ విధానాలతో సమన్వయం చేస్తూ పశువుల ఆరోగ్యం, పర్యావరణ స్థిరత్వం, ప్రజల్లో గోసేవపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఇందుకు ఎన్కపల్లిలో 99.14 ఎకరాలు కేటాయించారు. గోశాల అంచనా వ్యయం సుమారు రూ.157 కోట్లు. కనీసం వెయ్యి ఆవులను సంరక్షించేలా ఇక్కడ ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. బీఐఎస్ ప్రమాణాల ప్రకారం గోపూజ కోసం ఆలయ సముదాయం, గోశాల షెడ్లు, క్వారంటైన్ సౌకర్యాలు, అత్యవసర చికిత్స విభాగం, మిల్కింగ్ పార్లర్, పాల ప్రాసెసింగ్ యూనిట్ తదితరాలు నిర్మించనున్నారు. అలాగే, ఔట్ పేషెంట్ విభాగం, శస్త్రచికిత్స గది, ఐసొలేషన్ వార్డులు, ఫార్మసీ, ఎక్స్-రే గది, పాథాలజీ ల్యాబ్ తదితర సౌకర్యాలతో కూడిన ఆధునిక పశువైద్య ఆస్పత్రిని కూడా నిర్మించనున్నారు. బయోగ్యాస్, సీఎన్‌జీ ఉత్పత్తి చేసే ప్లాంట్, నీటి పునర్వినియోగం కోసం సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ), 3-4 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. గోవుల మేత కోసం 54 ఎకరాల్లో పచ్చి మేత పంటలు సాగు చేయనున్నారు. సందర్శకుల కోసం సమీపంలోని చెరువును అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఆట స్థలాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఏడాది చివరికి గోశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా విధించుకున్నారు.

# అదరం, బెదరం అక్రమాల అంతుతెలుస్తాం

**కాంగ్రెస్ నడిపేది సర్కారా? రౌడీ దర్బారా?**

**ప్రజలను భయపెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**కాంగ్రెస్ నడిపేది సర్కారా? రౌడీ దర్బారా?**

**పిచ్చోడి చేతిలో రాయి కాదు.. రాష్ట్రమే ఉన్నది**

**ఈ శతాబ్దపు మోసం అభయహస్తం మ్యానిఫెస్టో**

**అరాచకాలను అడ్డుకునేందుకు సిద్ధంకావాలి**

**ఇంటింటికీ వెళ్లి వివరించి ప్రజల్లో చైతన్యం తేవాలి**

**బీఆర్‌ఎస్వీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం**



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** సాములపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్ బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించిన సందర్భంలో కూడా ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు అడిగితే విజిలెన్స్ కేసులు, ప్రతిపక్షంగా తాము నిలదీస్తే బెదిరిస్తున్నారని, కాంగ్రెస్ నడిపేది సర్కారా.. రౌడీ దర్బారా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి బెదిరింపులకు బీఆర్‌ఎస్ ఎప్పటికీ భయపడదని కేటీఆర్ తేల్చిచెప్పారు. మూసీ సుందరీకరణ ముసుగులో రేవంత్‌రెడ్డి చేస్తున్న భారీ కుంభకోణంపై నగర ప్రజల్లో చైతన్యం కల్పించాలని బీఆర్‌ఎస్వీ నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ అరాచకాలను అడ్డుకునేందుకు విద్యార్థి విభాగం సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 2న ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేయాలని చెప్పారు. ఏప్రిల్ 4నుంచి 14వరకు వరకు 50బృందాలుగా ఏర్పడి మూసీ పరీవాహక ప్రాంతాలు, బస్తీలు, గల్లీల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి మూసీ ప్రక్షాళన వెనుక ఉన్న కాంగ్రెస్ కుట్రను వివరించాలని సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ప్రత్యేక టీషర్టులతో క్యాంపెయిన్ నిర్వహించాలని, విద్యార్థుల దెబ్బకు ప్రభుత్వం దిగొచ్చేలా ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో శనివారం సాయంత్రం బీఆర్‌ఎస్వీ హైదరాబాద్ నగర నేతలతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. వేల ఇండ్లు కూలగొట్టిన వ్యక్తిగా చరిత్రలో మిగిలిపోతావో.. లేక పద్ధతి మార్చుకుంటావో తేల్చుకో రేవంత్‌రెడ్డి అని హితవు పలికారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేసింది ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు కోసం మాత్రమేనని, పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోవడానికి కాదని స్పష్టంచేశారు.

### పిచ్చోడిచేతిలో రాష్ట్రం

'పిచ్చోడు కనిపిస్తే దూరంగా వెళ్తాం. అతడి చేతిలో రాయి ఉంటే ఇంకా దూరం వెళ్తాం. కానీ, రేవంత్‌రెడ్డి అనే పిచ్చోడి చేతిలో రాయి కాదు.. ఇప్పుడు రాష్ట్రమే ఉన్నది' అని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తం.. మెగా డీఎస్సీ వేస్తం.. యువతలకు స్కూటీలు ఇస్తం.. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తం.. ఇలా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం మ్యానిఫెస్టో.. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసమని మండిపడ్డారు. ఒక్క విద్యార్థులను, నిరుద్యోగులనే కాదు రైతు భరోసా, రుణమాఫీ, కౌలు రైతులకు ఏడాది రూ.15 వేలు ఇస్తామని రైతులను సైతం బురిడీ కొట్టించారని విమర్శించారు.

### మంత్రులు.. కమల్‌హాసన్‌ను మించిపోయారు

కాంగ్రెస్ మంత్రులు కమలహాసన్ కంటే పెద్ద యాక్టర్లుగా తయారయ్యారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో గ్యారెంటీ కార్డులను 100 రోజులు భద్రంగా పెట్టుకోవాలని భట్టి ప్రజలకు సూచించారని గుర్తుచేశారు. 100 రోజులు కాదు 800 రోజులు దాటాయి ఇప్పుడు ఆ కార్డులు ఎక్కడ పెట్టుకోవాలి? అని ప్రశ్నించారు. కోసినా పైసా లేదని అని చెప్పిన రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ.. నువ్వేమైన సేపువా? జమకాయవా? పిచ్చిపోయిన పుచ్చకాయవు రేవంత్‌రెడ్డీ?' అని విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్‌పై అసలు ప్రణాళికలు లేకుండా, డీపీఆర్ కూడా సిద్ధం చేయకుండా అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బఫర్ జోన్ పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తూ, పెద్దల ఇళ్లను వదిలేస్తున్నారని, ఇది ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.

### హైదరాబాద్‌ను కాపాడుకునే బాధ్యత యువతదే..

హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉన్నదని, మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇళ్లు కూల్చకుండా, భూములు స్వాధీనం చేసుకోకుండా శాస్త్రీయ పద్ధతిలో మూసీ శుద్ధి చేస్తే బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం వేలాది కుటుంబాలు భయాందోళనలో ఉన్నాయని, ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భావోద్వేగ అంశమని గుర్తుచేశారు. ఇచ్చిన హామీల అమలుకు ఒక రూపాయి లేదని చెప్పే సీఎం, తన అవినీతి సొమ్ముల కోసం మూసీ పేరిట లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తానని ప్రకటించడం దారుణమని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.16వేల కోట్లతో రూపొందించిన మూసీ సమగ్ర ప్రణాళికను పకన పెట్టి, భారీ అంచనాలతో అవినీతికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం మూసీ నదిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని మూసీలోకి పంపించే ప్రణాళిక కూడా సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. అయినా, ప్రస్తుత ప్రభుత్వం అంచనాలను అనవసరంగా పెంచి అవినీతికి బాటలు వేస్తున్నదని విమర్శించారు.

# అక్రమ మైనింగ్‌కు 'అధికారం' అండదండ

**కొత్వాల్‌గూడ వద్ద మంత్రికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్**

**మైనింగ్ అనుమతుల్లేకుండానే ఆ కంపెనీ పొంగులేటిది కాదంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడిన సీఎం**

**భార్య, కొడుకు దూరపు బంధువులా?**

**అసెంబ్లీలో హరీశ్‌రావు ధ్వజం**

**హౌస్ కమిటీ వేయాలని డిమాండ్**

**స్పీకర్ పోడియం వద్ద బైఠాయింపు**

**బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం లూటీ**

**మంత్రుల దీటైన కౌంటర్లు**



**ప్రజా దీవెన, హైదరాబాద్:** రాష్ట్రంలో కంచే చేను మేస్తే.. అన్నట్లుగా మంత్రులే అక్రమాలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ.. ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలోని జీవో 111 ప్రాంతంలో ఎలాంటి మైనింగ్, పర్యావరణ అనుమతుల్లేకుండా అక్రమ మైనింగ్ చేస్తోందని ఆరోపించారు. మినరల్ డీలర్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, కనీసం రిజిస్ట్రేషన్ కూడా లేకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. సీనరేజ్ చెల్లించకుండా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని, విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకోలేదని, డీజిల్ జనరేటర్లతోనే భారీ ఎత్తున మైనింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనసభలో మైనింగ్ పద్దులపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రి పొంగులేటిపె తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. విపక్ష బీఆర్‌ఎస్ సభ్యులు పట్టుబట్టిన 'హౌస్ కమిటీ' డిమాండ్, అధికార పక్షం ఇచ్చిన గట్టి కౌంటర్లతో సభ స్తంభించింది. మూసీని ప్రక్షాళన చేస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను తొలగిస్తున్నారని, కానీ.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌తో మూసీ నది, గండిపేట, హిమాయత్‌సాగర్ కలుషితం అవుతున్నాయని మైనింగ్ అధికారులు చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. మరోవైపు పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తమ్ముడికి చెందిన స్టోన్‌క్రషర్ యూనిట్‌లో చిన్న తప్పు జరిగిందంటూ రాత్రికి రాత్రే అరెస్టు చేసి నెలరోజులు జైల్లో పెట్టారని గుర్తుచేశారు.

### పదేళ్లలో అక్రమ మైనింగ్‌పైనా విచారణ..

హరీశ్‌రావు ఆరోపణలను అధికార పక్షం మూకుమ్మడిగా తిప్పికొట్టింది. మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా విపక్షంపై విరుచుకుపడ్డారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కంపెనీ తప్పుచేస్తే.. పై అధికారికి ఫిర్యాదు చేయాలని, ఒకే కంపెనీపై సభలో మాట్లాడటం సరైంది కాదని అన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. అక్రమ క్రషర్లపై చర్యలకు ఆదేశించామన్నారు. అయితే క్రిమినల్ కేసులు పెట్టి, జైల్లో పెట్టాలని చట్టం చెబుతోందని హరీశ్ పేర్కొన్నారు. దీంతో వ్యక్తిగతంగా ఒకే కంపెనీ గురించి మాట్లాడటం సరైంది కాదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. పదేళ్లలో ఇసుక దందా, మైనింగ్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని మంత్రి వివేక్ అన్నారు. రాఘవ కంపెనీలో మంత్రి పొంగులేటి పేరు లేదని, ఆయనపై తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని శ్రీధర్‌బాబు అన్నారు. హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ సభ్యులంతా లేచి హరీశ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. స్పీకర్ కూడా ఇవే సూచనలు చేసినా హరీశ్‌రావు వినకుండా 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులంతా స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి.. వెల్‌లో కూర్చొని నినాదాలు చేశారు. చివరికి హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అయినా.. బీఆర్‌ఎస్ సభ్యులు నిరసన కొనసాగించడంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇసుక రవాణా, క్వారీ వివాదాల నేపథ్యంలో దళితులపై దాడులు, పోలీసుల హింస పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇసుక మాఫియా వల్ల దళితుల ప్రాణాలు పోతున్నా.. అప్పట్లో హౌస్ కమిటీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. గంగుల కమలాకర్ మైనింగ్‌పైనా విచారణ జరిపించాలన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి మైనింగ్ అక్రమాలపై విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముందుగా బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన మైనింగ్ లూటీపై సమాధానం చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా సాగించారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వెల్‌లోకి వచ్చే సంప్రదాయం ఎప్పుడైనా చూశారా? చప్పట్లు కొట్టడమేంటి? అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. 'గత పదేళ్ల మైనింగ్ మాఫియాను పెంచి పోషించిన చరిత్ర మీది. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారు' అని అన్నారు. కాగా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మంత్రి పొంగులేటిది కాదని ముఖ్యమంత్రి చెప్పడం దుర్మార్గమని హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భార్య, కొడుకు, తమ్ముడు.. దూరపు బంధువులెలా అవుతారని ప్రశ్నించారు. రాఘవ అనేది పొంగులేటి తండ్రి పేరు అని తెలిపారు.

# ఆర్‌బిఎల్ కుంభకోణంలో 139 కోట్ల లావావేవీలు

**13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన బ్యాంక్ సిబ్బంది**

**ప్రజా దీవెన, కరీంనగర్ :** కరీంనగర్ కేంద్రంగా సాగుతున్న ఒక భారీ అంతర్జాతీయ సైబర్ నేరాల నెట్‌వర్క్‌ను కరీంనగర్ పోలీసులు ఛేధించారు. స్థానిక ఆర్‌బిఎల్ బ్యాంకును వేదికగా చేసుకుని సుమారు 139 కోట్ల రూపాయల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. 'ఆపరేషన్ క్రాక్ డౌన్'లో భాగంగా సాగించిన ఈ విచారణలో మ్యూల్ అకౌంట్ల ద్వారా సాగుతున్న ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటివరకు బ్యాంకు సిబ్బందితో సహా మొత్తం 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మోసంలో విస్తుపోయే నిజం ఏమిటంటే, సాక్షాత్తు బ్యాంకు మేనేజర్ , క్యాషియర్ నేరగాళ్లతో చేతులు కలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లో బాధితుల నుండి కొట్టేసిన సొమ్మును ఈ బ్యాంకులోని కరెంట్ అకౌంట్లలోకి మళ్లించేవారు. నిందితులకు సహకరించినందుకు గాను బ్యాంకు సిబ్బంది భారీగా లబ్ది పొందినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులు సుమారు 2,000 మందితో ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, కమిషన్ల ఆశ చూపి సామాన్య ప్రజల పేరుతో ఖాతాలను తెరిపించారు. ప్రతి లక్ష రూపాయల లావాదేవీకి అకౌంట్ హోల్డర్‌కు రూ. 2,000 కమిషన్ ఇస్తూ, వారి ఖాతాలను కేవలం ఒక ముసుగులా వాడుకున్నారు. బ్యాంకులోని కరెంట్ అకౌంట్ల ద్వారా జరిగిన ఈ వందల కోట్ల లావాదేవీలు పోలీసులకు అనుమానం కలిగించాయి. ఖాతాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించగా, దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ నేరాల సొమ్ము ఇక్కడికే చేరుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ అక్రమ సొమ్ము కేవలం దేశానికే పరిమితం కాకుండా చైనా , దుబాయ్ వంటి దేశాలకు కూడా మళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆర్‌బిఎల్ బ్యాంకుతో పాటు నగరంలోని మరో రెండు మూడు ప్రైవేట్ బ్యాంకుల్లో కూడా ఇదే తరహా అక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రస్తుతం అరెస్ట్ అయిన 13 మంది నిందితులను విచారిస్తున్న పోలీసులు, ఈ చైన్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంత మంది కీలక వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతాలను ఇతరులకు వాడటానికి ఇచ్చి అనవసరమైన చిక్కుల్లో పడకూడదని, తక్కువ శ్రమతో వచ్చే అదనపు ఆదాయం వెనుక పెద్ద మోసాలు ఉండవచ్చని కరీంనగర్ పోలీస్ యంత్రాంగం హెచ్చరిస్తోంది. 'ఆపరేషన్ క్రాక్ డౌన్' ద్వారా ఈ నెట్‌వర్క్ మూలాలను పూర్తిగా ఛేధిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

# మహిళా బిల్లుకు సంపూర్ణ సహకారం

**మహిళలకు రిజర్వేషన్‌తోనే 2029 ఎన్నికలు**

**నియోజకవర్గాల పునర్విభజన లేకుండా కోటా అమలు వీలుకాదు**

**బిల్లుకు సహకరించాలని ఖర్గే, రాహుల్‌ను కోరుతున్నాం**

**పునర్విభజన కమిషన్ ఏర్పాటుపై ప్రతిపక్షాలతో చర్చిస్తున్నాం**

**దేశంలో నక్సలిజం అంతరించినట్లే: కేంద్ర మంత్రి అమిత్‌షా**



**న్యూఢిల్లీ/కోల్‌కతా, మార్చి 28:** పార్లమెంటు ప్రస్తుత సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఆమోదింపజేయాలని భావిస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేసి, 2029 ఎన్నికలకు వెళ్దామనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ఓ ఆంగ్ల చానల్ ఇంటర్వ్యూతోపాటు.. శనివారం కోల్‌కతాలో మమతా బెనర్జీ ప్రభుత్వంపై చార్జిషీటు విడుదల చేసిన సందర్భంగా పలు అంశాలపై అమిత్‌షా మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే వచ్చే లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని ఎన్‌డీఏ ప్రభుత్వం భావిస్తుంటే కాంగ్రెస్ అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. 'నియోజకవర్గాల పునర్విభజన పూర్తి కాకుండా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయలేం. పునర్విభజన కమిషన్ ఏర్పాటుకు ప్రతిపక్షాలతో ప్రతి రోజూ చర్చిస్తున్నాం. కొన్ని విపక్షాలు, ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలు అందుకు అంగీకరించాయి. కాంగ్రెస్ మాత్రం మే నెలలో చర్చిద్దామని చెబుతోంది. ఇందుకు కారణమేంటో తెలియదు. పునర్విభజన బృహత్తర ప్రక్రియ. రాష్ట్రాలతో చర్చించాల్సి ఉంటుంది. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో బహిరంగ విచారణ చేపట్టాల్సి ఉంటుంది' అని అమిత్‌షా తెలిపారు. పార్లమెంటు ప్రస్తుత సమావేశాల్లోనే మహిళా బిల్లుపై చర్చించి ఆమోదించేందుకు సహకరించాలని ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతలైన రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు కోటా కావాలని కాంగ్రెస్ నిజంగా కోరుకుంటే వీలైనంత త్వరగా 'నారీశక్తి వందన్' చట్టం అమలుకు చర్చలను వేగరం చేసి సహకరించాలని కోరారు.



# అంతర్జాతీయంగా అల్లకల్లోలం అయినా మనం అప్రమత్తమయ్యాం

**నోయిడాలో జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1 ప్రారంభంలో మోదీ**

న్యూఢిల్లీ/నోయిడా, మార్చి 28 : పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు అల్లాడుతున్నాయని, కానీ, భారతదేశం మాత్రం నిలదొక్కుకుంటోందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచంలోని చాలా దేశాలు చమురు, ఆహారం, నిత్యావసరాల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయం తొలిదశలో నిర్మాణం పూర్తి చేసుకున్న టెర్మినల్ భవనాన్ని శనివారం ప్రధాని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు ఈ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలా అని ప్రయత్నిస్తుంటే.. భారత్ మాత్రం ఈ ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రతి చిన్నస్థాయిలోనూ అప్రమత్తంగా ఉన్నామన్నారు. ప్రజల మద్దతుతోనే ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. ఇంత పెద్ద సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా అభివృద్ధిలో దూసుకుపోతున్నామని చెప్పారు. ప్రజలు శాంతియుతంగా ఉండడమే కాకుండా ఓర్పుతో వ్యవహరించాలని సూచించారు. రాజకీయ పార్టీలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సమష్టి కృషి, ఐక్యతతోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని ప్రధాని మోదీ తెలిపారు. "ప్రస్తుతం విమర్శలు చేసేవారు రాజకీయంగా కొన్ని పాయింట్లు సంపాయించుకోగలరు. కానీ, ఇలాంటి చర్యలను ప్రజలు సహించరు. వారు వదిలి పెట్టరు. కరోనా సమయంలోనూ ఇలాంటి ప్రచారమే చేశారు. కానీ.. ప్రజలు వారిని తిప్పికొట్టారు" అని యూపీ విపక్షం సమాజ్‌వాదీపార్టీపై ప్రధాని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంతో ఉత్తరప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. అదేవిధంగా భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు కూడా అవకాశం ఉంటుందన్నారు.

# భద్రాద్రిలో రామరాజ్యం,కన్నుల పండువగా శ్రీరామపట్టాభిషేకం





**ప్రజా దీవెన, భద్రాచలం:** దక్షిణ అ యోధ్య జనసంద్రమైంది. మిథిలా స్టేడియం జయజయధ్వానాలతో మారుమోగింది. లోకకళ్యాణం కో సం జరిగిన సీతారాముల వివా హం ఒక ఎత్తైతే, ధర్మ సంస్థాపన కో సం రామయ్య పట్టాభిషిక్తుడైన ఘ ట్టం భక్తులను పరవశంలో ముంచె త్తింది. శనివారం ఉత్సవమూ ర్తు లను ఊరేగింపుగా వేదికపైకి తీ సుకురావడంతో వేడుక ప్రారంభ మైంది. విశ్వక్సేన పూజ, పుణ్యా హవాచనం అనంతరం ఎనిమిది మంది వేద పండితుల మంత్రో చ్చా రణల మధ్య పట్టాభిషేక క్రతువు శాస్త్రోక్తంగా సాగింది. ఈ మహో త్స వంలో రామయ్యకు సమర్పించిన ఒక్కో ఆభరణం వెనుక ఒక విశిష్ట త, భక్త రామదాసు అపారభక్తి కని పిశీచాయి. సార్వభౌమాధికారానికి చిహ్నంగా రాజదండాన్ని, ధర్మ రక్షణకు గు ర్తుగా బంగారు పాదుకలను స్వా మివారికి సమర్పించారు. భక్త రా మదాసు చేయించిన జగత్ ప్రసిద్ధ 'పచ్చల పతకం' రామయ్య హృద యాన్ని అలంకరించగా, సీతమ్మకు 'చింతాకు పతకం', లక్ష్మణుడికి 'శ్రీ రామమాడ' అలంకరించారు. వేడుకకు పరాకాష్ఠగా, భక్తుల కర తాళ ధ్వనుల మధ్య స్వామివారికి 'స్వర్ణ మకుటాన్ని' ధరింపజేశారు. 'శ్రీరామ సార్వభౌమా.. జయహో!' అన్న నినాదాలతో భద్రాద్రి గిరులు ప్రతిధ్వనించాయి. గగనం నుంచి దిగివచ్చిన ముత్యాలహారం దేవేంద్రుడు కానుకగా పంపినట్లుగా భావించే అత్యంత అరుదైన ము త్యాల హారాన్ని రామయ్యకు అ లంకరించారు. ఆహారం రాముడి నుండి సీతమ్మకు, అక్కడి నుంచి హనుమంతుడికి చేరిన ఘట్టం భ క్తుల కళ్ళకు కట్టింది. అనంతరం స ప్త నదులు, నాలుగు సముద్రాల నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో భక్తులందరిపై ప్రోక్షణ చేశారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నర్ శివ్ ప్రతాప్ శు క్లా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమ ర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.

# ఇరాన్ కొత్త సుప్రీం ఇక లేకపోవచ్చు

**మయామీలో ఓ సదస్సులో ట్రంప్ వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, మార్చి 28:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కూడా చనిపోయి ఉంటారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. మయామీలో జరిగిన ఓ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మొజ్తబా చనిపోయి ఉంటాడు. లేదా తీవ్రంగా గాయపడి ఉంటాడు. ఎందుకంటే ఆయన ఎక్కడా కనిపించట్లేదు" అన్నారు. ఇరాన్ నాయకత్వ నిర్మాణం మొత్తాన్ని అమెరికా ధ్వంసం చేసిందని, వారికిప్పుడు నాయకులు ఎవరూ లేరని చెప్పారు. ఇప్పుడు ఇరాన్ చర్చల కోసం అమెరికాను అడుక్కుంటోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, విలేకరులు తనను ఏ అంశంపైన అయినా నిర్భయంగా ప్రశ్నించవచ్చని, శృంగార విషయాలు కూడా అడగవచ్చని ట్రంప్ ఈ సందర్భంగా అనడం తీవ్ర చర్చకు దారి తీసింది.

# లాక్ డౌన్ ప్రస్తావన లేనేలేదు

**లాక్‌డౌన్ సమస్యే ఉత్పన్నం కాదు: కిషన్‌రెడ్డి**



హైదరాబాద్ : అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, మనదేశంలో ప్రస్తుత ధరలు మరింత పెరగకుండా ఉండేందుకే కేంద్రం వాటిపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. వాహనదారులకు నేరుగా ప్రయోజనం కలగకున్నా, కంపెనీలపై అదనపు భారం పడకుండా ఉండాలన్న ఉద్దేశం కూడా ఎక్సైజ్ సుంకాల తగ్గింపునకు కారణమన్నారు. దేశంలో అవసరాలకు అనుగుణంగా రిఫైనింగ్ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు వెల్లడించారు. శనివారం కవాడిగూడలోని సీజీవో టవర్స్ పీఐబీ కార్యాలయంలో ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లతో కిషన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పెట్రో డీలర్లకు 3 రోజుల క్రెడిట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని, దీంతో వారిపైనా ఆర్థికభారం పడకుండా ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో లాక్‌డౌన్ సమస్యే ఉత్పన్నం కాబోదని స్పష్టం చేశారు. డీజిల్ వినియోగం తగ్గించేందుకు ఈవీ వాహనాలను, ఎలక్ట్రికల్ రైళ్లను పెంచుతున్నట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల కోసం ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పెట్రోలు, డీజిల్‌పై దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలోనే అత్యధిక వ్యాట్ (35.20శాతం) వసూలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో వ్యాట్ 29శాతమే ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇష్టారాజ్యంగా వ్యాట్ వసూలు చేసిందని, ప్రస్తు త కాంగ్రెస్ కూడా నయాపైసా తగ్గించలేదని ఆయన ఆరోపించారు.

# విచారణకు నిర్దిష్టగడువు విధించాల్సిందే

**నియోజకవర్గాల పునర్విభజనతో సీఎంలో కుంగుబాటు**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**



**కరీంనగర్, మార్చి 28 :** కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మైనింగ్ అక్రమాలపై విచారణకు నిర్దిష్ట గడువు విధించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఫిర్యాదుల పేరుతో గ్రానైట్ కంపెనీలను ఎవరు బ్లాక్‌మెయిల్ చేశారో వెల్లడించాలన్నారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌పై విచారణను విచారణను స్వాగతిస్తున్నట్లు పేర్కొంటూ, అసెంబ్లీలో ప్రకటనలకే పరిమితమై, ఆచరణలో చర్యలు లేకపోతే ప్రజలు అంగీకరించరని చెప్పారు. 2024లో అసెంబ్లీ సాక్షిగా ఓఆర్ఆర్ టోల్ టెండర్‌పై నియమించిన సిట్ విచారణ ఏమైందని ఆయన ప్రశ్నించారు. కేరళ, తమిళనాడు ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అసెంబ్లీని రాజకీయ నిధుల సేకరణకు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు వేదికగా ఉపయోగిస్తున్నారా అని బండి ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే విచారణ జరిపించి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుతో సీఎం రేవంత్‌లో కుంగుబాటు మొదలైందని సంజయ్ చెప్పారు. దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ దుష్ప్రచారం చేస్తున్నారని, అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచుతున్నప్పుడు దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన బాధ్యత కేసీఆర్‌దే అయినప్పటికీ కాళేశ్వరం అవినీతి పరులను రేవంత్‌రెడ్డి సర్కార్ అరెస్టు చేయడం లేదన్నారు. కేసీఆర్, రేవంత్ కుమ్మక్కవడం వల్లే కేసీఆర్ కుటుంబం సహా బీఆర్ఎస్ నేతల అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని బండి ఆరోపించారు.

# మా విద్యాసంస్థలే వాళ్ల లక్ష్యం.. అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ తీవ్ర ఆరోపణలు

**టెహ్రాన్, మార్చి 29:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య ఇరాన్ సంచలన ఆరోపణలు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు కావాలనే తమ దేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ మండిపడింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి సోషల్ మీడియా వేదికగా ఈ ఆరోపణలు చేశారు. ఇరాన్ శాస్త్రీయ పునాదులను, సాంస్కృతిక వారసత్వాన్ని దెబ్బతీసేందుకే ఈ క్రూరమైన దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. కేవలం సైనిక స్థావరాలనే కాకుండా, చారిత్రక కట్టడాలు, మేధావులను కూడా టార్గెట్ చేస్తున్నారని పేర్కొన్నారు.

# యుద్ధ రంగంలోకి హౌతీలు!

యెమెన్‌లోని ఇరాన్ అనుకూల హౌతీ గ్రూపు కూడా యుద్ధంలోకి దిగింది. ఇజ్రాయెల్‌లోని కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని శనివారం క్షిపణులు ప్రయోగించింది. యుద్ధం మొదలైన సమయంలోనే హౌతీలు ఇరాన్‌కు మద్దతుగా రావొచ్చని భావించినా ఇప్పటివరకు సంయమనం పాటించారు. ఇరాన్‌కు అవసరమైతే తాము రంగంలోకి వస్తామని , అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని శుక్రవారమే ప్రకటించారు. ఆ మరునాడే ఇజ్రాయెల్‌పైకి దాడులు చేపట్టడం గమనార్హం. ఎర్ర సముద్రం నుంచి అరేబియా సముద్రంలోకి వచ్చే కీలకమైన 'బాబ్ అల్ మందేబ్' జలసంధిపై హౌతీలకు పట్టుంది. హోర్ముజ్ జలసంధి లాగే ఇది కూడా కేవలం 30 కిలోమీటర్ల వెడల్పు ఉన్న మార్గం. యూరప్ దేశాల నుంచి సూయజ్ కెనాల్, ఎర్ర సముద్రం మీదుగా ఆసియా దేశాల మధ్య వాణిజ్యం జరుగుతుంది. ఇప్పుడు 'బాబ్ అల్ మందేబ్'లో నౌకలపై హౌతీలు దాడి చేస్తే.. సముద్ర రవాణాకు ఇబ్బంది తప్పదు. అదే జరిగితే చమురు ధరలు మరింత పెరగడం ఖాయమన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

# ప్రత్యేక ప్రజావాణి పిర్యాదులపై సత్వర చర్యలు

**నల్లగొండ:** ప్రత్యేక ప్రజావాణిలో వ చ్చిన ఫిర్యాదులపై అధికారులు స త్వరమే చర్యలు తీసుకోవాలని జి ల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నా రు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యా లయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కా ర్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధుల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ వృద్ధులు, దివ్యాంగులు సోమ వారం నిర్వహించే ప్రజావాణి లో ఇ బ్బంది పడవద్దని వారికై ప్రతి నెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావా ణి నిర్వహిస్తున్నామని ఇట్టి అ వ కాశన్ని జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవా లని కోరారు. కాగా శనివారం ది వ్యాంగులు, వృద్ధుల కొరకు నిర్వ హించిన ప్రత్యేక ప్రజావాణి కార్య క్రమంలో మొత్తం 74 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి రె వెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీని వాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణ వేణి, గృహ నిర్మాణ శాఖ పీడి రా జ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన ఆస్ప త్రి సూపరింటెండెంట్ నరసింహా రా వు నేత, అధికారులు, సిబ్బంది, త దితరులు హాజరయ్యారు.



# నాగార్జున సాగర్ బుద్ధవనాన్ని సందర్శించిన శ్రీలంక మంత్రి హిణిడు మ సునీల్ సేన్వి



**ప్రజా దీవెన, నాగార్జున సాగర్:** ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచంలో శాంతి స్థాపన అత్యంత కీలకమని శ్రీలంక బుద్ధ సేన రిలీజియస్, సాం స్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి హిణిడుమ సునీల్ సేన్వి అన్నారు. శనివారం ఆయన తెలంగాణ రా ష్ట్రంలోని నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ వద్ద ఉన్న బుద్ధవనాన్ని సం దర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ భారతదేశంలో ప్రత్యేకించి తె లంగాణ రాష్ట్రంలో ఎంతో గుర్తింపు పొందిన, ప్రాచుర్యం పొందిన బుద్ధి ష్ట మాన్యుమెంట్స్ ఉండడం, ప్ర త్యేకించి బుద్ధవనం ప్రాజెక్టు ఎం తో ప్రాముఖ్యత పొందిందని అన్నా రు. సమకాలీన ప్రపంచంలో శాంతి అతిముఖ్యమన్నారు. బుద్ధిజం నుండి అనేక విషయాలను నేర్చు కోవచ్చని శుక్రవారం హైదరాబా దు లో నిర్వహించిన ప్రపంచ బుద్ధ శాంతి సమావేశం తనకు ఎంతో సంతృప్తిని, విశేష అనుభవాన్ని కలిగించిందని తెలిపారు. బుద్ధవనం లాంటి ఆధునిక బుద్ధ ప్రాజెక్టులు మరియు నమూనాల ను శ్రీలంకలో కూడా విస్తరించా ల్సి న అవసరం ఉందని పేర్కొన్నారు. మంత్రి పర్యటనలో 21 దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, బిక్షుణీ లు, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, బుద్ధ వనం ఫౌండర్ మాజీ డీజీపీ ఆంజ నేయరెడ్డి, నటుడు శ్రీ గగన్ మాలి క్, వియత్నాం ప్రొఫెసర్ వైస్ ఛాన్స లర్ తిక్నాథ్ టు, నవ నలంద వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సిద్ధార్థ్ సింగ్, శాసన సభ్యుడు రవీంద్ర తదితరు లు పాల్గొన్నారు.

# స్వామివారి కల్యాణానికి ముస్తాబవుతున్న శ్రీ వరవర రంగనాయక స్వామి దేవాలయం



**ప్రజా దీవెన కోదాడ :** మండల పరిధిలోని గణపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ వరవర రంగనాయక స్వామి దేవాలయం స్వామివారి కల్యాణానికి ముస్తాబవుతుంది ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ ఇర్లా వరహాల రెడ్డి, దేవాలయ పాలకవర్గం తెలిపిన వివరాల ప్రకారం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వరవర రంగనాయక స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఏప్రియల్ రెండవ తారీకు గురువారం రాత్రి 10 గంటలకు వేద పండితుల మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల , సివిల్ సప్లై శాఖ మంత్రి నలమాద ఉ త్తంకుమార్ రెడ్డి కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి గణపవరం గ్రామ సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్యలు పాల్గొంటారని కావున గణపవరం చుట్టుప్రక్కల ఉన్న అనేక గ్రామాల ప్రజలుపెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు ఆదివారం నేటి నుండి దేవాలయంలో తొలక్కం దివ్య ప్రబంధ పారాయణం కార్యక్రమాలు ప్రారంభమై ఏప్రిల్ నాలుగో తారీఖు శనివారం వరకు కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాలు ను తిలకించి విజయవంతం చేయాలని

# కోదాడ పబ్లిక్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్ష కార్యదర్శులుగా కత్రం సీతారాంరెడ్డి పోటు రంగారావు**





**ప్రజా దీవెన, కోదాడ:** కోదాడ పబ్లిక్ క్లబ్ కార్యవర్గం ఎట్టకేలకు ఏకగ్రీవమైనది శుక్రవారం రాత్రి క్లబ్బు కార్యవర్గాన్ని ఎంపిక చేయడానికి నియమించిన ఐదు గురు సభ్యుల కమిటీ 2026 28 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు క్లబ్ అధ్యక్షునిగా కత్రం సీతారాంరెడ్డి కార్యదర్శిగా విశ్రాంతి ఉ పాధ్యాయులు పోటు రంగారావు, ఉపాధ్యక్షులుగా తోట రంగారావు ,గుండపునేని వెంకట సత్యనారాయణ రావు, సంయుక్త కార్యదర్శి వంగవీటి గురునాథం, కోటమర్తి విద్యాసాగర్ రావు, కార్యవర్గ సభ్యులు తమ్మిన బోయిన రామయ్య, అమరనాయిని శేషగిరిరావు, సుంకర సత్యనారాయణ, మేకల ప్రతాప్ ,ముంద్ర రవికుమార్, ఇర్లా నాగమునిందర్ రెడ్డి కుక్కడపు వెంకటేశ్వరరావు ఎంపిక చేశారు పబ్లిక్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేయటానికి సహకరించిన రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్థానిక శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి మాజీ మంత్రి వేరేపల్లి లక్ష్మీనారాయణ మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్రావు, బొల్లం మల్ల యాదవ్, లకు ఐదుగురు కమిటీ సభ్యులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, పైడిమర్రి సత్యబాబు, ముత్త వరపు పాండురంగారావు, వేనెపల్లి వెంకటయ్య, పారసీతయ ,లు కృతజ్ఞతలు తెలిపారు.

# నల్లగొండ ప్రజలకు తీపికబురు

**NH-565 అభివృద్ధికి పచ్చజెండా**

**ప్రజా దీవెన, నల్లగొండ:** నల్లగొండ నగర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీ పి కబురు అందించింది. ఎంతో కా లంగా ఎదురుచూస్తున్న నల్లగొండ నగర ప్రజలకు శుభవార్త అందింది. నక్రేకల్--నాగార్జునసాగర్ జాతీయ రహదారి (NH-565) అభివృద్ధి ప నులకు కేంద్రప్రభుత్వం రూ.14.45 కోట్ల నిధులను ఆమోదించింది. దీంతో 2025--26 వార్షిక ప్రణాళి క లో భాగంగా ఈ ప్రాజెక్టు అమలు కానుంది. నల్లగొండ జిల్లా కేంద్రంలో సూర్యా పేట మార్గంలోని పానగల్ అద్దంకి బైపాస్ రోడ్డులోని ఇందిరాగాంధీ వి గ్రహం నుంచి డీఈఓ కార్యాలయం వరకు సుమారు కిలోమీటర్ 20.3 00 నుంచి 23.730 వరకు రహదా రి విస్తరణ మెరుగుదల చేపట్టేందు కు రోడ్డు ఉపరితలాన్ని బ్లాక్ టా పింగ్ ద్వారా బలోపేతం చేయను న్నారు. ఇందుకు సంబంధించి రోడ్డు ర వా ణా, జాతీయ రహదారుల మంత్రి త్వ శాఖ అన్ని పరిపాలనా సాంకే తిక, ఆర్థిక అనుమతులను ఇప్ప టికే మంజూరు చేసింది. తెలంగాణ ఆర్‌డబీ శాఖ పంపిన ప్రతిపాదన కు ఎటువంటి మార్పులు లేకుండా పూర్తి ఆమోదం లభించడం విశే షం. ఇదిలా ఉంటే ఈ రహదారి విస్తర ణ ప్రయాణం సులభం కాదని గతా నుభవాలు తెలియజేస్తున్నాయి. గతంలో రోడ్డు విస్తరణకు ప్రయ త్నాలు చేపట్టినప్పుడు, రహదారి పక్కన ఉన్న షాపులు, గృహాలు ప్ర భావితమవుతాయనే ఆందోళనతో వ్యాపారులు, స్థానికులు నిరసన లు చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే కొందరు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచి పోయాయి కూడా. తాజాగా రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో రహదారిని బైపాస్ మార్గంలో మా ర్చే నిర్ణయం తీసుకున్నారు. కేం ద్రంతో పలుమార్లు చర్చలు జరిపిన తర్వాతే ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు కావడం జరుగగా ఈ విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పలు సందర్భాల్లో బ హిరంగంగా వెల్లడించిన విషయం విదితమే. కాగా ఈ సందర్భంగా న ల్లగొండ నగర మేయర్ బుర్రి చైత న్య శ్రీనివాసరెడ్డి మంత్రి కోమటిరె డ్డికి కృతజ్ఞతలు తెలిపారు.స్మార్ట్ సిటీ అభి వృద్ధి భాగంగా ఈ రహ దారి పనులు చేపడుతున్నట్లు తెలి పారు. అయితే ఇప్పటికే ఆలస్యమైన ఈ ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తి అ వుతుందా, నగర ట్రాఫిక్ సమస్య లకు ఎంతవరకు ఉపశమనం కలి గిస్తుందో వేచిచూడాల్సి ఉంది. ఏది ఏమైనా తాజా పరిణామాలతో ప్ర నల్లగొండ నగర నడిమధ్య గుండా వెళ్ళే ప్రధాన రహదారి విస్తరణకు రంగం సిద్ధం కావడంతో నగర ప్ర జల్లో కొత్త ఆశలు మళ్లీ చిగురించా యని చర్చ అప్పుడే జోరుగా సాగు తోంది.

# మాధవరంలో కన్నీటివ్యధ

**భార్య మృతి తట్టుకోలేక భర్త హఠాన్మరణం, ఉదయం ఆమె, మధ్యాహ్నం భర్త**



**ప్రజా దీవెన, శాలిగౌరారం:** జీవి తాంతం ఒకరికి ఒకరు తోడుగా ని లిచిన దంపతులు చివరికి మర ణంలో కూడా విడిపోకుండా వెళ్లి పోయిన హృదయ విదారక ఘట న నల్లగొండ జిల్లాలో చోటు చేసు కుంది. నల్లగొండ జిల్లా శాలిగౌరా రం మండలం మాధవరం (కలాన్) గ్రామానికి చెందిన మామిడి ముత్త మ్మ (73) అనారోగ్యంతో శనివారం ఉదయం సుమారు 6 గంటలకు క న్నుమూసింది. జీవిత భాగస్వా మి ని కోల్పోయిన ఆ క్షణాన్ని భరించ లేకపోయిన భర్త మామిడి సైదులు (79) తీవ్ర వేదనలో మునిగిపోయా డు. “ఆమె లేక నేను ఎలా…?” అనే ని శ్శబ్ద ప్రశ్న అతని మనసును కలచి వేసింది. భార్య మృతదేహం వద్దే కూర్చొని తట్టుకోలేని దుఃఖంతో ఉండిపోయిన సైదులు కేవలం ఐ దు గంటల వ్యవధిలోనే, ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వైద్యుడిని పిలిపించగా అ ప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఒకే రోజు లో కొన్ని గంటల వ్యవధిలోనే ఇద్ద రు దంపతులు ప్రాణాలు విడవడం తో ఆకుటుంబం మాత్రమే కాదు, మొత్తం గ్రామం శోకసంద్రంగా మా రింది. ఇంత ప్రేమ, ఇంత అను బంధం అంటూ గ్రామస్థులు కన్నీళ్లు ఆపు కోలేకపోయారు.ఈ దంపతులకు ఏకైక కుమార్తె యాదమ్మ ఉండగా తల్లి దండ్రులిద్దరికీ ఆమెనే తలకొ రివి పెట్టడం కొసమెరుపు. ఒకే చి తిపై కలిసిన ఆ దంపతుల జీవితం గ్రామ ప్రజల హృదయాల్లో ఎప్ప టికీ మిగిలే జ్ఞాపకంగా మిగిలిపో యింది.

# కోదాడ పోలీసు అధ్వర్యంలో హెల్మెట్ వినియోగం పై అవగాహన ర్యాలీ

**హెల్మెట్ ధరించి ప్రమాదాలలో రక్షణ పొందండి.. డి యస్ పి**



**ప్రజా దీవెన, కోదాడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో కోదాడ పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగం పై అవగాహన ర్యాలీని నిర్వహించారు పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని కోదాడ సబ్ డివిజనల్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ తో కలిసి ప్రారంభించారు. ర్యాలీ ఖమ్మం క్రాస్ రోడ్డు నుండి రంగా థియేటర్ క్రాస్ రోడ్డు వరకు నిర్వహించి స్థానిక ప్రజలకు, వాహనదారులకు, స్థానిక వ్యాపారులకు హెల్మెట్ వినియోగం పట్ల అవగాహన కల్పించారు. ర్యాలీ నందు పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పౌరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదాడ డివిజన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చునని సూచించారు. ద్విచక్ర వాహనంపై కూర్చునే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత హెల్మెట్ వినియోగం అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు. ప్రతి పౌరుడు, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాల పట్ల, సురక్షిత ప్రయాణం పట్ల, రహదారుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రజలకు రోడ్డు నియమాల పట్ల, జాగ్రత్తల పట్ల విస్తృతంగా అవగాహన కల్పిస్తుందని ప్రజలు వాహనదారులు గమనించాలని కోరారు. వాహనదారులు వాహనాలు నిదానంగా నడపాలని అన్నారు. ఈ ర్యాలీ నందు పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, పట్టణ ఎస్ఐ సుధీర్, పోలీసు సిబ్బంది స్థానిక పౌరులు పెద్దలు పాల్గొన్నారు.

# శాలిగౌరారంలో ఘనంగా సీతారాముల కళ్యాణం



**శాలిగౌరారం :** శాలిగౌరారం ప్రాజెక్టు సమీపం లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం మధ్యరాత్రి సీతా రాముల కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది.ఆలయధర్మ కర్తలు శేషం రామచంద్రాచార్యులు, రఘునందనా చార్యులు, రత్నమాచార్యులు వేద పండితుల సారధ్యం లో ఆగమ సాంప్రదాయం విధానం లోస్వామి వారి జగత్ కళ్యాణం చూడ ముచ్చట గా జరిగింది.అంతకు ముందు స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు .వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.ఈ కార్యక్రమం లో శాలిగౌరారం, తిరుమలరాయిని గూడెం,రామగిరి గ్రామ సర్పశీచులు గుజిలాల్ శేఖర్ బాబు, చాడ కవిత-సురేష్ రెడ్డి,చాడ చంద్రకళ -హతీష్ రెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ జమ్ము రమేష్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులం దరికీ ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలి



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** నల్లగొండ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులందరికీ తక్షణ మే ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూశనివారం స్థానిక ఆర్డీఓ అశోక్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యు లు ఎండి సలీం మాట్లాడుతూ ఈ ఆందోళన సుమారు నాలుగు సం వత్సరాలు నుండి చేస్తున్నప్పుడు కూడా ప్రభుత్వ అధికారులు గానీ ఇక్కడున్న మంత్రి గాని పట్టి పట్టిన ట్టు ఉండడం పేదల పట్ల ఇంత నిర్ల క్ష్యం వహించడం సరైనది కాదన్నా రు. ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తున్న అని చెప్తున్నా కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ మంత్రి పేదల పట్ల ఇంత కనికరం లేకుండా ఆయ న పదవిలోకి వచ్చి రెండున్నర సం వత్సరాలు అవుతున్నా కూడా అ నేకమార్లు విన్నపాలు, విజ్ఞప్తులు చేసినప్పటికీ కూడా ఇవ్వడానికి చే తులు రావట్లేదన్నారు. పట్టణంలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులం దరూ కిరాయిలు కట్టుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నప్పటికీ కూడా అనేకసార్లు ధర్నాలు పో రాటాలు నిర్వహించినప్పటికీ రేపు ఇస్తాం మాకు ఇస్తామని చెప్పేసి స ర్వేలన్నీ నిర్వహించి నవంబర్ 20 వ తారీకు పేపర్లన్ని రెడీ చేసి ఇస్తా మని చెప్పేసి ఇవ్వకుండా మున్సిప ల్ ఎన్నికలు గ్రామపంచాయతీ ఎన్నికలు అన్ని అయిపోయినా కూడా ఇప్పటికి ఇవ్వడానికి కూడా అధికారులకు గాని మంత్రి దాటవే సే ధోరణి సరైంది కాదన్నారు. సిపి ఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య మాట్లాడుతూ వీరందరూ కూడా నిజమైన లబ్ధిదారులు వీరి కోసం మంత్రి తమ నిధుల నుంచి పెట్టి అక్కడ పనులు చేయిస్తామని చెప్పినప్పుడు కూడా సగం పను లు మధ్యలో ఆగిపోయిన పరిస్థితి అక్కడ మళ్ళీ అసాంఘిక కార్యక్ర మాలకు నిలువుగా మారే పరిస్థితి ఉ న్నదన్నారు.

ఇప్పటికైనా అధి కారులు స్పందించి వెంటనే జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని లబ్ధిదా రులకు ప్రొసిడిన్సు ఇల్లు అప్పజె ప్పాలని డిమాండ్ చేశారు.

ఈ కా ర్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, డబల్ బెడ్ రూమ్ పోరాట సాధన కమిటీ కన్వీనర్ అవుట రవీందర్, కమిటీ సభ్యు లు గంజి రాజేష్ సిహెచ్ అ నురాధ, గౌసియా బేగం, సిరాజ్, పగిళ్ల శీను, గిరిజ ఎస్.కె లతీఫ్, విజయలక్ష్మి, జయమ్మ, గణేష్ రా ధా తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ అభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలి




## 2024 తర్వాత ఏపీలో మీడియాకు మాట్లాడే స్వేచ్ఛ వచ్చింది

## ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

విజయవాడ: గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీలో మీడియాకు ప్రశ్నించే స్వేచ్ఛ, మాట్లాడే స్వేచ్ఛను కల్పించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గతంతో పోల్చుకుంటే మీడియాలో విలువలు వేగంగా పడిపోతున్నాయని... విలువల పునరుద్ధరణ జరిగేలా చూడాలని జర్నలిస్టులను సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు సొంత మీడియా ఉ ండటం ప్రమాదానికి దారితీస్తోందని అన్నారు. తమది జర్నలిస్ట్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శక్తి మేరకు కృషి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రికి ఐజేయూ అధ్యక్షుడలు కె. శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎస్ ఎన్. సిన్హా ఉపాధ్యక్షులు సోమసుందర్,కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, ప్లీనరీ ఆహ్వాన కమిటీ చైర్మన్ ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏపీయుడబ్ల్యూజె ఐ వి.సుబ్బారావు, ఉ పాధ్యక్షులు, టీయూడబ్ల్యూజె అధ్యక్షులు ఖాజా విరాహత్ అలీ, ఐ జె యు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం ఏ. మాజిద్, కార్యవర్గ సభ్యులు కె. రామనారాయణ, కొంజేటి సత్యనారాయణ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. సీనియర్ జర్నలిస్టులను సీఎం అప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విజయవాడలో ఐజేయూ 11వ ప్లీనరీని జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఆనాడు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు హైదరాబాద్ లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పుడు ఫలితాలు కనిపిస్తున్నాయని ఐజేయూ ప్రతినిధులు చెప్పడం సంతోషంగా ఉంది. ప్రస్తుత కాలంలో జర్నలిజం బాగా మారిపోయింది. మీడియా విపరీత పోకడలు సమాజానికి మంచిది కాదు. అలవోకగా అబద్ధాలను చిత్రీకరిస్తున్నారు. మీడియాలో విలువలు, సిద్ధాంతాలు పడిపోతున్నాయి. దీన్ని పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉంది. 2019లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ వివేకానందరెడ్డి చనిపోతే నాపై తప్పుడు వార్తలు రాశారు. మొదట వైఎస్ వివేకా మరణాన్ని గుండెపోటుగా చిత్రీకరించారు. పోస్టు మార్టానికి ఆదేశించడంతో అసలు విషయాలు బయటపడేసరికి హత్య నెపాన్ని నాపై మోపారు. నారాసుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టి సాక్షిలో తప్పుడు వార్త రాశారు. తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరగ్గకుండా నియంత్రించేలా జర్నలిస్టులు కృషి చేయాలి"అని సీఎం చంద్రబాబు అన్నారు.

### మాది మీడియా ఫ్రెండ్లీ ప్రభుత్వం

"మాది మీడియా ఫ్రెండ్లీ ప్రభుత్వం. రాష్ట్రాభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలి. క్రిమినల్స్ రాజకీయాల్లోకి వస్తే ఏమవుతుందో గత ఐదేళ్లలో చూశాం. పాజిటివ్ న్యూస్ ఇవ్వమని కోరడం లేదు. ప్రొగ్రెసివ్ న్యూస్ ఇవ్వాలని మీడియాను కోరుతున్నా. మంచిని, శాంతిని, అభివృద్ధిని ప్రమోట్ చేయాలి. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని మీడియానే ప్రపంచానికి తెలియచేయాలి. రాష్ట్రాభివృద్ధిలో మీడియా తగిన పాత్ర పోషించాలి. ఇవాళ అసెంబ్లీలో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కోరుతూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. వచ్చే ఐదేళ్లల్లో అమరావతిలో అద్భుతమైన అభివృద్ధిని చూస్తారు. అలాగే వివిధ రంగాల్లో ఏపీ అభివృద్ధి చెందుతోందని దాన్ని జర్నలిస్టులు అధ్యయనం చేసి విశ్లేషించాలి. రాష్ట్ర రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే 2019-24 మధ్య కాలంలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగింది. గత ఐదేళ్లల్లో జరిగిన వ్యవహారాన్ని మీడియా అంతా చూసింది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానులు అన్నారు. ఏది పడితే అది చేశారు. ఏది పడితే అది మాట్లాడారు. వీటిని కొన్ని సందర్భాల్లో మీడియా తప్పు పట్టింది. తాము చేసిన తప్పులను ఎత్తి చూపే మీడియాను కంట్రోల్ చేయడానికి నాటి ప్రభుత్వం జీవో నెంబర్ 2430 తెచ్చింది. సోషల్ మీడియా ఇప్పుడు అతి పెద్ద సమస్యగా ఉంది. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. దీన్ని నియంత్రించేలా జర్నలిస్టులు చొరవ తీసుకోవాలి."అని సీఎం చంద్రబాబు సూచించారు.

### జర్నలిస్టుల సంక్షేమం చూసే బాధ్యత మాది

"ఉమ్మడి ఏపీలో మండల రిపోర్టర్లకు అక్రిడేషన్లు ఇవ్వడం తెలుగుదేశం హయాంలోనే మొదలైంది. జర్నలిస్టులకు నాడు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు కూడా చేశాం. జర్నలిస్టుల మీద దాడులు జరిగితే విచారణకు జిల్లాలో ఎస్పీ స్థాయిలో కమిటీ విచారించేలా నిబంధనలు తెచ్చాం. 2014 తరువాత డెస్క్ జర్నలిస్టులకు, సబ్ ఎడిటర్లకు అక్రిడేషన్లు, బస్సు ప్రయాణంలో రాయితీలు కల్పించాం. 2014-19 మధ్య జర్నలిస్టులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించగా గత ప్రభుత్వంలో తీసేశారు. మేము 2018లో 20 వేల అక్రిడేషన్లు ఇస్తే... గత ప్రభుత్వం వాటిని సగానికి తగ్గించింది. అర్హులందరికీ అక్రిడేషన్లు ఇస్తాం. హైదరాబాద్ లో మంత్రుల క్వార్టర్ల కోసం కేటాయించిన స్థలాన్ని కూడా ప్రెస్ క్లబ్ కు ఇచ్చాం.ఉ మ్మడి రాష్ట్రంలో1996లో ప్రెస్ అకాడమీ ఏర్పాటు చేసాం. అమరావతిలో ఐజేయూ కార్యాలయానికి స్థలం ఇచ్చే అంశాన్ని సబ్ కమిటీకి అప్పజెబుతాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.



# కార్మిక హక్కుల రక్షణకై సీఐటీయూ పోరాడుతుంది



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక హక్కుల రక్షణకై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీ నర్ అవుట రవీందర్ పిలుపుని చ్చారు. శనివారం సిఐటియు రా ష్ట్ర కమిటీ పిలుపుమేరకు పరిశ్ర మల కార్మికుల స్థితిగతులపై పట్ట ణంలోని పలు రైస్ మిల్లులలో స ర్వే చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బీహార్ ఇతర రాష్ట్రాల నుండి వలసలు వ చ్చి ఇక్కడ రైస్ మిల్లులో హమాలీ పనులతో పాటు మిల్ డ్రైవర్లుగా ఇతర పనులు చేస్తున్నారని అన్నా రు. వలస కార్మికుల చట్టం అమలు చేయాలని వారికి నివాసయోగ్యం ఆహారం ఇతర మౌలిక సదుపా యాలు కల్పించాల్సిన బాధ్యత యజమాన్యాలపై ఉందని అన్నా రు. ప్రభుత్వాల నుండి రైస్ మిల్ యాజమాన్యాలకు రావలసిన బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో యాజమాన్యాలు ఇబ్బందులకు గురవుతున్నారని సర్వేలో తెలిసిందని అన్నారు.ఈ కార్య క్రమంలో హమాలీ యూనియన్ నాయకులు రాజేష్ మితిలేష్, రా ము వెంకట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** ప్రజలకు న్యాయం వేగంగా అందిం చడానికిలోక్ అదాలత్ విజయవం తంగా కొనసాగుతుందని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలి పారు. రాష్ట్ర న్యాయ సేవా అధి కార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వ ర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదా లత్ ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16 లో క్ అదాలత్ బెంచిలను ప్రజల సౌక ర్యార్థం ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్లో 20 సివిల్ కేసులు, 55 35 క్రిమినల్ కేసులు,156 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 8125 ఇతర ప్రీలిటిగేషన్ కేసులు, 37 సైబర్ క్రైమ్ కేసులు, మొత్తం 13,938 కేసులు పరిష్కరించబ డాయి. ప్రమాద భీమా కేసుల్లో రూ.8,13,10,945 నష్టపరిహారం, సైబర్ క్రైమ్ కేసుల్లో రూ. 2,76,2 00 రికవరీ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జ డ్జి, కార్యదర్శి పి.పురుషోత్తం రా వు,ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ వాదులు,లా కాలేజీ విద్యార్థులు, కక్షిదారులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఎదుగుదలకు పౌష్టికాహారం మేలు

**శాలిగౌరారం:** శాలిగౌరారం మండలం జాలోనిగూడెం లోని అంగన్వాడీ కేంద్రంలో సుపోషణ దివాస్ - ఆరోగ్య దివాస్ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు.ఈ కార్యక్రమంలో మహిళలు,పిల్లలకు పోషకాహారం అందించి ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు పోషకాహారం అందించి,ఆరోగ్య సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమం లో ఏఎన్ఎం లు లోడే పద్మావతి, ఎం. మయూరి, హెల్త్ అసిస్టెంట్ మొలుగూరి భాస్కర్, అంగన్వాడీ టీచర్ ఆకవరం కరుణ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో దారుణం

## ఆటోలో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారం

**విజయవాడ :** దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. ఎక్కడో ఒకచోట మృగాళ్లు కాచుకునే ఉంటున్నారు. ఏదో ఒక చోట వారిపై కామాంధులు లైంగిక దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. చిన్న, పెద్ద, వృద్ధులు అనే తేడా లేకుండా రెచ్చిపోతున్నారు. ఒంటరిగా చిక్కితే పాపం.. అత్యాచారాలకు తెగపడుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి విజయవాడలో జరిగింది. ఆటో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి వెళ్లాల్సిన ప్రాంతానికి కాకుండా బలవంతంగా కృష్ణలంక వైపునకు తీసుకెళ్లాడు కామాంధుడు. భయభ్రాంతులకు గురి చేసి ఎవరూ లేని ప్రదేశానికి లాక్కెళ్లాడు. అనంతరం యువతిపై అత్యాచారానికి ఒడికట్టాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలిపెట్టి ఆటోతో సహా పరారయ్యాడు. ఏడుస్తూ ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లికి చెప్పింది. షాక్‌కు గురైన బాధిత కుటుంబం మాచవరం పోలీసులను ఆశ్రయించారు. తనపై జరిగిన లైంగిక దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆటో డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది.

# ఆరంభ పోరులో సన్‌రైజర్స్ ఓటమి

## బెంగళూరు బాదుడు

## చెలరేగిన కోహ్లీ, దేవ్‌దత్






బెంగళూరు: ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అదరగొట్టింది. 202 పరుగుల ఛేదనను మరో 26 బంతులుండగానే ముగించి వహ్వా అనిపించింది. ఏడాది తర్వాత టీ20 మ్యాచ్ ఆడినా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (38 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 నాటౌట్) ఆటలో ఏమాత్రం జోరు తగ్గలేదు. గత సీజన్ ఫామ్‌ను కొనసాగిస్తూనే అజేయంగా నిలిచాడు. అటు ఇషాన్ కిషన్ నేతృత్వంలో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ బౌలింగ్‌తో నిరాశపర్చింది. దీంతో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో అలవోకగా గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 201 పరుగులు చేసింది. ఇషాన్ (38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 80), అనికేత్ (18 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 43), క్లాసెన్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) రాణించారు. ఐపీఎల్ అరంగేట్ర పేసర్ డఫీ, షెఫర్డ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 15.4 ఓవర్లలోనే 4 వికెట్లకు 203 పరుగులు చేసి గెలిచింది. దేవ్‌దత్ పడిక్కల్ (26 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 61), కెప్టెన్ రజత్ పటీదార్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 31) వేగంగా ఆడారు. పైన్‌కు రెండు వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా డఫీ నిలిచాడు.

విరాట్ అండగా..: భారీ ఛేదనలో బెంగళూరు ఎక్కడా తడబడలేదు. పిచ్ ఫ్లాట్‌గా మారడంతో ఆరంభం నుంచే పరుగుల వరద పారించింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ సాల్ట్ (8) వెనుదిరిగినా.. దేవ్‌దత్, విరాట్ జోడీ చెలరేగింది. ముఖ్యంగా దేవ్‌దత్ ఎడాపెడా భారీ షాట్లతో అదరగొట్టాడు. నాలుగో ఓవర్‌లో అతను 18 రన్స్ రాబట్టడంతో స్కోరు 50కి చేరింది. అటు విరాట్ బౌండరీల సహాయంతో పవర్‌ప్లేలో ఆర్‌సీబీ 76/1 స్కోరుతో పటిష్టంగా నిలిచింది. విరాట్ క్యాచ్‌ను క్లాసెన్ వదిలేయడం కలిసొచ్చింది. 21 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన దేవ్‌దత్ తొమ్మిదో ఓవర్‌లో 4,6తో మరింత జోరు చూపినా హర్ష్ దూబేకి చిక్కాడు. దీంతో రెండో వికెట్‌కు 45 బంతుల్లోనే 101 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రజత్ పటీదార్ సైతం క్రీజులో ఉన్నంతసేపు ధాటిని కనబర్చగా.. విరాట్ కళ్లు చెదిరే సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. 12వ ఓవర్‌లో పటీదార్ 4,6,6తో 22 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే రజత్ పటీదార్, జితేశ్ (0)లను డేవిడ్ పైన్ వరుస బంతుల్లో అవుట్ చేసి రైజర్స్‌కు కాస్త ఊరటనిచ్చాడు. ఈ దశలో విరాట్ బ్యాట్ ఝుళిపించాడు. 33 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన కోహ్లీ.. విజయానికి కావాల్సిన 17 పరుగులను వరుసగా 6,4,4,4 బాది 16వ ఓవర్‌లోనే మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న ఇషాన్.. అనికేత్: సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ ఇషాన్ కిషన్ మెరుపు ఆరంభం.. అనికేత్ వర్మ సూపర్ ఫినిషింగ్ కీలకంగా నిలిచాయి. మధ్యలో క్లాసెన్ కాస్త నిలకడ చూపాడు. ఈ ముగ్గురే రెండంకెల స్కోర్లు సాధించినా.. రైజర్స్ 200ం స్కోరుతో సవాల్ విసిరింది. విధ్వంసకర ఓపెనర్లు హెడ్ (11), అభిషేక్ (7)లను పేసర్ డఫీ మూడో ఓవర్‌లోనే పెవిలియన్ చేర్చాడు. అనంతరం నితీశ్ (1) కూడా డఫీకే చిక్కడంతో 29/3 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. అయితే ఆరో ఓవర్‌లో ఇషాన్ 6,4,6తో 16 రన్స్ రాబట్టి పవర్‌ప్లేను 49 పరుగులతో ముగించాడు. ఈ దశలో అతనికి క్లాసెన్ సహకరించాడు. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని ఇద్దరూ పరుగులు రాబట్టారు. 12వ ఓవర్‌లో 3 ఫోర్లు బాదిన ఇషాన్ 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. క్రునాల్ ఓవర్‌లోనూ ఇషాన్ రెండు, క్లాసెన్ ఒక సిక్సర్‌తో 21 రన్స్ అందించారు. అయితే క్లాసెన్ క్యాచ్‌ను బౌండరీ లైన్ దగ్గర సాల్ట్ అద్భుతంగా పట్టేయడంతో నాలుగో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే ఇషాన్ క్యాచ్‌ను సైతం సాల్ట్ ఒంటి చేత్తో డైవింగ్ చేస్తూ పట్టేశాడు. ఇక చివర్లో అనికేత్ ఎడాపెడా షాట్లతో జట్టు స్కోరు తగ్గకుండా చూశాడు. 19వ ఓవర్‌లో 6,4,6 బాదిన అనికేత్.. కోహ్లీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చివరి ఓవర్‌లో 9 పరుగులతో రైజర్స్ స్కోరు 200 దాటింది.

### స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) సాల్ట్ (బి) డఫీ 11, అభిషేక్ (సి) జితేశ్ (బి) డఫీ 7, ఇషాన్ (సి) సాల్ట్ (బి) అభినందన్ 80, నితీశ్ (సి) అభినందన్ (బి) డఫీ 1, క్లాసెన్ (సి) సాల్ట్ (బి) షెఫర్డ్ 31, సలీల్ (సి) దేవ్‌దత్ (బి) సుయాష్ 9, అనికేత్ (సి) విరాట్ (బి) షెఫర్డ్ 43, హర్ష్ దూబే (సి) దేవ్‌దత్ (బి) షెఫర్డ్ 3, హర్షల్ (సి) దేవ్‌దత్ (బి) భువనేశ్వర్ 0, పైన్ (నాటౌట్) 6, ఉనాద్కట్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 201/9. వికెట్ల పతనం: 1-18, 2-23, 3-29, 4-126, 5-137, 6-155, 7-167, 8-174, 9-192. బౌలింగ్: డఫీ 4-0-22-3, భువనేశ్వర్ 4-0-31-1, అభినందన్ 3-0-38-1, షెఫర్డ్ 4-0-54-3, సుయాష్ 3-0-28-1, క్రునాల్ 2-0-26-0.

బెంగళూరు: సాల్ట్ (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 8, విరాట్ (నాటౌట్) 69, దేవ్‌దత్ (సి) క్లాసెన్ (బి) హర్ష్ 61, రజత్ (సి) హర్ష్ (బి) పైన్ 31, జితేశ్ (సి) ఉనాద్కట్ (బి) పైన్ 0, టిమ్ డేవిడ్ (నాటౌట్) 16, ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 15.4 ఓవర్లలో 203/4. వికెట్ల పతనం: 1-9, 2-110, 3-163, 4-163. బౌలింగ్: నితీశ్ 2-0-19-0, ఉనాద్కట్ 3-0-29-1, పైన్ 3-0-35-2, హర్ష్ 3-0-35-1, మలింగ 2-0-35-0, హర్షల్ 2.4-0-39-0.

## కొన్ని రికార్డులు బద్దలు కొట్టడం అసాధ్యమే!

2008లో ప్రారంభమైన ఈ లీగ్ ప్రతి సీజన్‌లోనూ ఒక కొత్త మైలురాయిని చేరుకుంటోంది. ప్రతి సీజన్‌లో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. లీగ్‌లో నమోదైన కొన్ని రికార్డులు ఎన్నేళ్ళు గడిచినా చెక్కుచెదరకుండా ఉన్నాయి. 2026లో కూడా అవి అలాగే ఉండే అవకాశం ఉంది. ఇందులో విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ మధ్య నమోదైన భారీ భాగస్వామ్యం , ఒకే ఓవర్‌లో 37 పరుగులు సహా పలు రికార్డులు ఉన్నాయి. ఐపీఎల్ చరిత్రలో 10 ఆల్‌టైమ్ రికార్డులు ఇక్కడ అందిస్తున్నాం. వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ క్రిస్ గేల్ ఐపీఎల్‌లోనూ మ్యాజిక్ చేశాడు. టీ20 ఫార్మాట్ రారాజు, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ తను. ఐపీఎల్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగుల రికార్డు గేల్ పేరిట ఉంది. ఆ ఇన్నింగ్స్‌లో గేల్ ఏకంగా 17 సిక్సర్లు బాదాడు. పూణే వారియర్స్ పై ఆడిన ఈ ఇన్నింగ్స్‌లో పలు రికార్డులు నమోదయ్యాయి. ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు.వేగవంతమైన సెంచరీ కూడా 'యూనివర్స్ బాస్' క్రిస్ గేల్ పేరిట ఉంది. క్రిస్ గేల్ 23 ఏప్రిల్ 2013న పూణే వారియర్స్ పై జరిగిన మ్యాచులో కేవలం 30 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో నేటికీ ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. గత సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ మెరుపు సెంచరీ బాదినప్పటికీ, అతను కూడా ఈ రికార్డును బద్దలుకొట్టలేదు. 35 బంతుల్లో సెంచరీ పూర్తి చేసి, ఐపీఎల్‌లో రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ ఐపీఎల్‌లో అతిపెద్ద భాగస్వామ్యం నెలకొల్పారు. 14 మే 2016న గుజరాత్ లయన్స్ పై 229 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో రికార్డులు తిరగరాశారు. కోహ్లీ, డివిలియర్స్ ఇద్దరూ సెంచరీలు చేశారు. ఆ మ్యాచ్‌లో డివిలియర్స్ 52 బంతుల్లో 129 పరుగులు, కోహ్లీ 55 బంతుల్లో 109 పరుగులతో చెలరేగారు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ రికార్డు రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్ యశస్వి జైస్వాల్ పేరిట ఉంది. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ 11 మే 2023న కోల్‌కతా నైట్ రైడర్స్ పై కేవలం 13 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. విరాట్ కోహ్లీ పేరిట చెక్కుచెదరని ఈ రికార్డును అధిగమించడం దాదాపు చాలా కష్టం. కోహ్లీ 2016 సీజన్‌లో 973 పరుగులు చేశాడు. 2016 ఎడిషన్‌లో అద్భుత ఫాంలో ఉన్న కోహ్లీ 4 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలు చేశాడు. తరువాత గిల్ 2023లో 890 పరుగులు చేసి ఈ రికార్డును బద్దలు కొట్టేంత దగ్గరకు వచ్చాడు.ఐపీఎల్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు రవీంద్ర జడేజా, క్రిస్ గేల్ పేరిట ఉంది. గేల్ ఆర్‌సిబి తరపున ఆడుతూ 2011లో కొచ్చి టస్కర్స్ బౌలర్ పరమేశ్వరన్ ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. 2021లో సిఎస్‌కె తరపున ఆడుతూ జడేజా ఆర్సీబీపై హర్షల్ పటేల్ ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ బౌలింగ్ స్పెల్ వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ అల్జారీ జోసెఫ్ పేరిట ఉంది. తన అరంగేట్రం మ్యాచ్‌లోనే ఈ ఘనత సాధించాడు. 6 ఏప్రిల్ 2019న జరిగిన అరంగేట్ర మ్యాచ్‌లో అల్జారీ జోసెఫ్ 3.4 ఓవర్లలో కేవలం 12 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు.కోల్‌కతా నైట్ రైడర్స్ 2014, 2015 సీజన్ల మధ్య వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచింది. కేకేఆర్ తప్ప మరే ఇతర జట్టు ఇప్పటి వరకు వరుసగా ఇన్ని మ్యాచ్‌లలో విజయం సాధించలేదు. 2014లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలిచింది.ఒక సీజన్‌లో అత్యధిక క్యాచ్‌లు (వికెట్ కీపర్లను మినహాయించి) పట్టిన రికార్డు ఆర్సీబీ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ పేరిట ఉంది. ఆర్‌సిబి తరపున ఆడుతూ 2016లో డివిలియర్స్ మొత్తం 19 క్యాచ్‌లు అందుకున్నాడు.

## రోహిత్ శర్మను చూసి ఆశ్చర్యపోయిన నీతా అంబానీ



ముంబై ఇండియన్స్ శిక్షణ శిబిరంలో ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో జట్టు యజమాని నీతా అంబానీ ప్రాక్టీస్ సెషన్‌ను పరిశీలించడానికి వచ్చారు. అక్కడ రోహిత్ శర్మను చూడగానే ఆమె ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. రోహిత్ గతంతో పోలిస్తే చాలా బరువు తగ్గడమే కాకుండా, ఎంతో చురుగ్గా కనిపిస్తున్నారు. ఆయనను చూడగానే నీతా అంబానీ స్పందిస్తూ.. "మై గాడ్ రోహిత్! నేను నిన్ను గుర్తుపట్టలేకపోయాను. నువ్వు అచ్చం ఒక కుర్రాడిలా కనిపిస్తున్నావు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోను ముంబై ఇండియన్స్ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో పంచుకుంది. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లక్షలాది వ్యూస్ సాధించింది. రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై పెట్టిన శ్రద్ధను చూసి నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. 2026 సీజన్ కోసం రోహిత్ మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా ఎంతో సిద్ధంగా ఉన్నారని ఈ వీడియో స్పష్టం చేస్తోంది.ముంబై ఇండియన్స్ తన తొలి మ్యాచ్‌ను మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది. సొంత మైదానమైన వాంఖడే స్టేడియంలో జరగనున్న ఈ పోరులో రోహిత్ శర్మ కొత్త అవతారంలో బరిలోకి దిగనున్నాడు. గత సీజన్లలో ఫిట్‌నెస్‌పై వచ్చిన విమర్శలకు సమాధానం చెబుతూ, ఈసారి భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని రోహిత్ కృతనిశ్చయంతో ఉన్నాడు. హార్దిక్ పాండ్యా సారథ్యంలో రోహిత్ ఓపెనర్‌గా జట్టుకు ఎలాంటి ఆరంభాన్ని ఇస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ముంబై జట్టు ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలవడంలో రోహిత్ పాత్ర ఎంతో కీలకం. ఇప్పుడు సారథ్య బాధ్యతలు లేకపోయినా, ఒక సీనియర్ ఆటగాడిగా జట్టును నడిపించే బాధ్యత ఆయనపై ఉంది. నీతా అంబానీ అన్నట్లుగా, రోహిత్ మళ్ళీ తన కెరీర్ ఆరంభ రోజుల్లో ఉన్నంత ఫిట్‌గా కనిపిస్తుండటం జట్టుకు సానుకూల అంశం. ఈ కొత్త ఉత్సాహంతో హిట్ మ్యాన్ మైదానంలో సిక్సర్ల వర్షం కురిపిస్తారని ముంబై పల్టాన్ ఆశిస్తోంది.

## నా కడుపులో బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లీనే

### తెలుగు ఇన్‌ఫ్లూయెన్సర్ షాకింగ్ వీడియో

సోషల్ మీడియా వచ్చిన తర్వాత చాలా మంది రీల్స్ పిచ్చితో పిచ్చి పిచ్చి వేషాలు చాలానే వేస్తున్నారు. లైకులు పిచ్చితో కొంతమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటుంటే మరికొంతమంది చిత్రవిచిత్రమైన పనులు చేస్తుంటారు. అవి చూస్తే కొన్నిసార్లు నవ్వు వస్తుంది కానీ చాలా సార్లు చిరాకు కూడా వస్తుంది. అలాంటి వీడియోనే ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సోషల్ మీడియా ఇన్ఫుయెన్సర్స్ చాలా మంది రకరకాలుగా పాపులర్ అవుతుంటారు. కొందరు గ్లామర్ తో మరికొంతమంది కామెడీతో, ఇంకొంతమంది తమ యాక్టింగ్ స్కిల్స్ తో క్రేజ్ తెచ్చుకుంటుంటారు, వీరందరి కంటే ఎక్కువ మంది క్రింజ్ తో పాపులర్ అవుతుంటారు. ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్న ఓ వీడియో. ఓ అమ్మాయి తన కడుపులో బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లీ అంటూ వీడియోలు చేసి షాక్ ఇచ్చింది. అంతే కాదు విరాట్ తనకు లవ్ బైట్ ఇచ్చాడని వీడియోలు చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తుంది ఆమె.. ఆమె పేరు పెద్దగా ఎవ్వరికీ తెలియదు కానీ.. సోషల్ మీడియాలో గతంలో స్వేయ్ గర్ల్ పేరుతో వీడియోలు చేసేది. క్రికెటర్ విరాట్ కోహ్లీకి వీరాభిమాని అయిన ఆమె ఎక్కువగా ఆర్సీబీకి సపోర్ట్ చేస్తూ వీడియోలు చేసేది. ప్రతి ఐపీఎల్ సీజన్ కు రకరకాల వీడియోలు చేస్తూ పాపులర్ అయ్యింది. కొంతమంది ఆర్సీబీ ఫ్యాన్స్ కూడా ఈ అమ్మడికి తెగ సపోర్ట్ చేస్తుంటారు. ఇంతవరకూ బాగానేఉంది .. కానీ రీసెంట్ గా ఆమె తన కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లీ అని చెప్పి షాక్ ఇచ్చింది. అంతే కాదు విరాట్ తనకు లవ్ బైట్ ఇచ్చాడు అని కూడా చెప్పుకుంటూ వీడియో చేసింది. ఈ వీడియో వైరల్ అవ్వడంతో కోహ్లీ ఫ్యాన్స్ ఓ రేంజ్ లో మండిపడుతున్నారు. ఈ పాపులారిటీ కోసం మా అభిమాన క్రికెటర్ పేరు చెడగొడతావా.? అంటూ ఫైర్ అవుతున్నారు.

## ధోని అభిమానులకు బ్యాడ్ న్యూస్.. ఐపీఎల్ 2026 నుంచి అవుట్!

మహేంద్ర సింగ్ ధోని అభిమానులకు పిడుగు లాంటి వార్త. ఐపీఎల్ 2026 మరికొన్ని గంటల్లో ఆరంభం కానున్న తరుణంలో సీఎస్కే నుంచి షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ధోని పిక్క గాయం బారిన పడ్డట్లు పేర్కొంది. దాంతో అతడు ఐపీఎల్ 2026 తొలి రెండు వారాలకు ధోని దూరం అయినట్లు పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదిక ద్వారా స్పష్టం చేసింది. ఈ రెండు వారాల పాటు అతడు పునరావాసంలో ఉండనున్నట్లుగా పేర్కొంది. ఇది ధోని అభిమానులకు బిగ్ షాక్ లాంటిదే. అతడు ఆడితే చూడాలనుకునే వారికి ధోని గాయం పెద్ద షాక్‌కు గురి చేసింది. గత కొన్ని రోజులుగా సీఎస్కే ఏర్పాటు చేసిన ప్రాక్టీస్ సెషన్స్‌లో ధోని చురుకుగా పాల్గొన్నాడు. భారీ షాట్స్ ఆడుతూ కనిపించాడు. అయితే తాజాగా ధోని గాయం బారిన పడటంతో రెండు వారాల పాటు ఐపీఎల్‌కు దూరం కావడం విచారకరం. ధోని గత కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. గత రెండు సీజన్లలో మోకాలి నొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. 2024 సీజన్‌లో అయితే గాయంతోనే ఐపీఎల్ ఆడాడు. అనంతరం మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. 2025లో ఎటువంటి గాయం లేకపోవడంతో 2024 కంటే కూడా ఫిట్‌గా కనిపించాడు. అయితే ఇప్పుడు పిక్క గాయం బారిన పడటంతో అతడి అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ధోని వయసు 44 ఏళ్లు. ఈ ఏజ్‌లో క్రికెట్ లాంటి గేమ్స్ ఆడటం శరీరాన్ని త్వరగా అలసిపోయేలా చేస్తుంది. ప్రస్తుతానికి ధోని కేవలం రెండు వారాల ఆటకు మాత్రమే దూరమైనట్లుగా సీఎస్కే తన ట్వీట్‌లో పేర్కొంది. అయితే వయసును పరిగణలోకి తీసుకుంటే అది కష్టమనే చెప్పాలి. సీఎస్కే తన తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 3న ఆడనుంది. రెండు వారాల్లో అతడు కోలుకుంటే ఏప్రిల్ 11 లేదా 14న జరిగే మ్యాచ్‌తో అతడు రీ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. సీఎస్కే మేనేజ్‌మెంట్ ఇచ్చిన సమాచారాన్ని బట్టి అతడు తన టీమ్ ఆడే తొలి 3 మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది.టీమిండియా తరపున మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గాడు. ప్రస్తుతం 44 ఏళ్లు. ధోనికి క్రికెట్‌లో సాధించాల్సింది ఏముంది? ఏం లేదు.. హాయిగా రిటైర్మెంట్ ఇవ్వకుండా తన ఆరోగ్యాన్ని పాడుచేసుకోడం ఎందుకు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 2024లో మోకాలి గాయం కారణంగా ధోని చాలా ఇబ్బంది పడ్డాడు. 2022 నుంచి కూడా ధోనికి ఇదే చివరి సీజన్ అంటూ ఐపీఎల్ ఆరంభం అయ్యే ప్రతిసారి ప్రచారం జరుగుతూనే ఉంది. అయితే ధోని మాత్రం ఐపీఎల్‌కు రిటైర్ అవ్వలేదు. ధోని రిటైర్ అయితే అది సీఎస్కేకు పెద్ద దెబ్బే. అందుకే ధోని తర్వాత సీఎస్కేకు ఎవరనే ప్రశ్నకు సంజూ సామ్సన్ రూపంలో సమాధానం దొరికింది. చూస్తుంటే ధోనికి ప్లేయర్‌గా ఇదే చివరి సీజన్ అయ్యేలా ఉంది.



# చెల్లి నిర్మాత... అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## పట్టు పరికిణిలో ఆకట్టుకుంటున్న వైష్ణవి చైతన్య!

'బేబీ' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న తెలుగు అమ్మాయి వైష్ణవి చైతన్య, ఇప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్‌లతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ముఖ్యంగా పట్టు పరికిణి, లంగా ఓణి వంటి ట్రెడిషనల్ లుక్స్‌లో అచ్చమైన తెలుగు ఇంటి ఆడపిల్లలా కనిపిస్తూ అభిమానుల మనసు గెలుచుకుంటోంది. అటు మోడ్రన్ డ్రెస్సుల్లో మెరుస్తూనే, ఇటు సంప్రదాయ కట్టుబొట్టుతో తనదైన శైలిలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది ఈ బ్యూటీ. ఆమె అందం, అభినయం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఆ విశేషాలు చూద్దాం.. వైష్ణవి చైతన్య ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసే ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఆమె పట్టు పరికిణి ధరించి దిగిన ఫోటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. వెండితెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో ఆమెను చూడటం తమకు ఎంతో ఇష్టమని ఫాలోయర్స్ కామెంట్స్ చేస్తున్నారు. కేవలం ఫోటోలతోనే కాకుండా, తన కళ్ళతోనే హావభావాలను పలికిస్తూ కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టిస్తోంది. ఈ ఫోటోలు చూస్తుంటే వైష్ణవి తన తదుపరి సినిమాల కోసం ఎంతగా సిద్ధమవుతుందో అర్థమవుతోంది. కెరీర్ విషయానికి వస్తే, వైష్ణవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. 'బేబీ' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత మళ్ళీ ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఏ పిక్' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. గత ఏడాది సిద్ధూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటించి మెప్పించిన ఈ భామ, ఇప్పుడు ఈ కొత్త సినిమాతో తన సక్సెస్ గ్రాఫ్‌ను మరింత పెంచుకోవాలని చూస్తోంది. వైష్ణవి క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాలేదు. ఇప్పుడు పక్కనే ఉన్న కోలీవుడ్‌లోనూ ఈమె పేరు మారుమోగుతోంది. తమిళ స్టార్ హీరో ఆర్య సరసన ఒక క్రేజీ ప్రాజెక్టులో నటిస్తున్నట్లు సమాచారం. అలాగే హీరో విష్ణు విశాల్ సరసన మరో తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా మొదలయ్యాయని తెలుస్తోంది. ఇవే కాకుండా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలో కూడా ఆమె కీలక పాత్ర పోషిస్తోంది. ఇలా రెండు తెలుగు, రెండు తమిళ చిత్రాలతో వైష్ణవి జెట్ స్పీడ్‌లో దూసుకుపోతోంది.




# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

## హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో

దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. రిషబ్ శెట్టి ఈ అంశంపై స్పందించే వరకు ఈ సస్పెన్స్ కొనసాగడం ఖాయం.

### కొత్త సినిమా కోసం

# మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ధురంధర్-2 ఓ చెత్త సినిమా

## అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ



ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు. ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA